

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 14-02-2026 | సంపుటి - 26 | సంచిక -266 | రూ : 4 | పేజీలు: 8



## ముగిసిన పార్లమెంట్ సమావేశాలు

- మార్చి 9 నుంచి ఏప్రిల్ 2 వరకు రెండో దశ
- చివరి రోజు ప్రతిపక్షాల ఆందోళనలు
- అమెరికాతో ట్రేడ్ డీల్, ఎప్‌స్టీన్ ఫైల్స్‌పై నిరసనలు
- పలు అంశాలపై కేంద్రాన్ని నిలదీసిన సభ్యులు



2లో

## ఎంపీపై అనర్హత వేటు ప్రొసీజర్ ఇదే!



- కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ సభ్యత్వం రద్దుకు బీజేపీ ఎంపీ నోటీసు
- లోక్ సభ సభ్యుడిపై అనర్హత వేటు ప్రక్రియపై చర్చ
- ఎథిక్స్ కమిటీ సూచనలకు అనుగుణంగా స్పీకర్ నిర్ణయం

2లో



# పట్టణం హస్తానిదే

- 68 మున్సిపాల్టీల్లో కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆధిక్యం
- బీఆర్ఎస్ 14కే పరిమితం
- 33 చోట్ల హంగ్
- 1,530 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు
- 775 స్థానాలతో రెండో స్థానంలో బీఆర్ఎస్
- 4 కార్పొరేషన్లలో కాంగ్రెస్ పాగా
- నిజామాబాద్, కరీంనగర్‌లో బీజేపీకి మెజార్టీ స్థానాలు
- కొత్తగూడెంలో అత్యధిక స్థానాలు దక్కించుకున్న సీపీఐ
- 16న మేయర్, డిప్యూటీ మేయర్, చైర్మెన్, వైస్ చైర్మెన్ల ఎన్నిక

హైదరాబాద్ : మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. మొత్తం 116 మున్సిపాల్టీలు, ఏడు కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగాయి. వాటిలో 64 మున్సిపాల్టీలు, 4 కార్పొరేషన్లలో కాంగ్రెస్‌పార్టీ సంపూర్ణ మెజారిటీ సాధించింది. 14 మున్సిపాల్టీల్లో బీఆర్ఎస్ గెలిచింది. బీజేపీ ఏ మున్సిపాల్టీలోనూ స్పష్టమైన ఆధిక్యతను కనబర్చలేదు. కరీంనగర్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లలో హంగ్ ఏర్పడింది. ఇక్కడ బీజేపీ అత్యధిక స్థానాల్ని గెలిచింది. కొత్తగూడెం మున్సిపాల్టీని బీఆర్ఎస్ తరువాయి 2లో

## లక్షల మంది కార్యకర్తల శ్రమ ఫలితమిది

### మున్సిపల్ ఫలితాలపై సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: 'రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని కట్టబెట్టిన రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం సీఎం ఒక ప్రకటన విడుదల చేశారు. "ఈ విజయం లక్షల మంది తరువాయి 2లో

## బంగ్లా పీఠంపై బీఎన్‌పీ

- 209 స్థానాల్లో విజయఢంకా
- రెండు దశాబ్దాల తర్వాత అధికారంలోకి
- దేశ నూతన ప్రధానిగా తారిఖ్ రెహమాన్



ఢాకా: బంగ్లాదేశ్‌లో దాదాపు ఏడాదిన్నరగా కొనసాగుతున్న రాజకీయ అస్థిరతకు తెరపడింది. దేశ 13వ సార్వత్రిక ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) ఘన విజయం సాధించింది. మూడింట రెండు వంతుల స్థానాల్లో నెగ్గి.. రెండు దశాబ్దాల తర్వాత బంగ్లా అధికార పీఠాన్ని కైవసం చేసుకుంది. ఎన్నికలు జరిగిన 299 పార్లమెంటు స్థానాల్లో 209 సీట్లలో బీఎన్‌పీ విజయఢంకా మోగించింది. పాకిస్థాన్‌తో అత్యంత సన్నిహిత తరువాయి 2లో



## సేవా తీర్థ్‌లో ప్రతి క్షణం దేశ హితం కోసమే పనిచేస్తా

- ప్రధాని మోదీ ఉద్ఘాటన
- చారిత్రక సౌత్‌బ్లాక్ నుంచి నూతన భవనంలోకి మారిన పీఎంవో

దిల్లీ: కొత్తగా నిర్మించిన ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) 'సేవా తీర్థ్'లో ప్రతి క్షణం దేశ హితం కోసమే పనిచేస్తానని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. వికసిత్ భారత్ దిశగా దేశ ప్రయాణంలో తరువాయి 2లో


## బలపడిన భారత పాస్‌పోర్ట్.. 75వ స్థానానికి జంప్

- హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌లో 75వ స్థానానికి చేరిన భారత్
- గతేడాది 85వ ర్యాంకు నుంచి 10 స్థానాలు మెరుగుదల
- భారత పాస్‌పోర్ట్‌తో 56 దేశాలకు వీసా రహిత ప్రయాణం
- జాబితాలో అగ్రస్థానంలో నిలిచిన సింగపూర్ పాస్‌పోర్ట్

ఢిల్లీ : ప్రపంచంలోని అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్ట్‌ల జాబితాలో భారత్ తన స్థానాన్ని గణనీయంగా మెరుగుపరచుకుంది. హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత పాస్‌పోర్ట్ 75వ స్థానంలో నిలిచింది. గతేడాది 85వ స్థానంలో ఉన్న భారత్ తరువాయి 2లో



## ఒకే కాలనీలో 6 పార్కులను కాపాడిన హైడ్రా



- హైదరాబాద్‌లో పార్కుల కబ్జాలపై హైడ్రా ఉక్కుపాదం
- ఒకేరోజు రూ.34 కోట్ల విలువైన 3041 గజాల భూముల స్వాధీనం
- భాగ్యలక్ష్మి కాలనీలో 6 పార్కులు, గుడిమల్కాపూర్‌లో ఒక పార్కుకు విముక్తి
- హైడ్రా చర్యలతో స్థానికుల సంబరాలు, భారీ ర్యాలీలు
- ప్రజావాణి ఫిర్యాదులపై కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో వేగంగా స్పందన

హైదరాబాద్ : హైడ్రా ఉక్కుపాదం మోపింది. ప్రజలకు ప్రాణవాయువును అందించే పచ్చని ప్రదేశాలను కాపాడేందుకు నడుం బిగించింది. శుక్రవారం ఒక్కరోజే రెండు వేర్వేరు ప్రాంతాల్లో మెరుపు దాడులు నిర్వహించి సుమారు రూ. 34.12 కోట్ల విలువైన 3,041 గజాల పార్కు స్థలాలను కబ్జాదారుల చెర నుంచి విడిపించింది. హైడ్రా తీసుకున్న ఈ చర్యలతో స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. తరువాయి 2లో

## వరల్డ్ రేడియో డే... డిజిటల్ యుగంలోనూ ఉనికిని చాటుకుంటున్న రేడియో

- ప్రధాని మోదీ 'మన్ కీ బాత్'తో పెరిగిన ఆదరణ
- గ్రామీణ ప్రాంతాల్లో సమాచారానికి కీలక సాధనం
- నేడు ప్రపంచ రేడియో దినోత్సవాన్ని జరుపుకుంటున్న ప్రపంచం



2లో

## నల్లమలసాగర్‌పై... తెలంగాణ అభ్యంతరం చెప్పడం తగదు

- నల్లమలసాగర్ ప్రాజెక్టుపై తెలంగాణ అభ్యంతరం సరికాదన్న సీఎం చంద్రబాబు
- 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తామని వెల్లడి
- ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం
- ఆరోగ్య సేవల మెరుగుకు సంజీవని.. ఫిబ్రవరి 16న రాష్ట్రానికి బిల్ గేట్స్
- విశాఖకు గూగుల్, టీసీఎస్.. రామాయపట్నం వద్ద బీపీసీఎల్ భారీ రిఫైనరీ



2లో

# 'పట్టణం' హస్తానిదే

హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగింది. మొత్తం 116 మున్సిపాల్టీలు, ఏడు కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగాయి. వాటిలో 64 మున్సిపాల్టీలు, 4 కార్పొరేషన్లలో కాంగ్రెస్‌పార్టీ సంపూర్ణ మెజారిటీ సాధించింది. 14 మున్సిపాల్టీల్లో బీఆర్ఎస్ గెలిచింది. బీజేపీ ఏ మున్సిపాల్టీలోనూ స్పష్టమైన ఆధిక్యతను కనబర్చలేదు. కరీంనగర్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లలో హంగ్ ఏర్పడింది. ఇక్కడ బీజేపీ అత్యధిక స్థానాల్ని గెలిచింది. కొత్తగూడెం మున్సిపాల్టీని బీఆర్ఎస్ మద్దతుతో సీపీఐ కైవసం చేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో 2996 వార్డులో ఎన్నికలు జరగాల్సి ఉండగా, 12 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. ఒక వార్డులో ఎన్నిక వాయిదా పడింది. మిగిలిన 2,983 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. వాటిలో తుది వార్తలు అందే సమయానికి కాంగ్రెస్ పార్టీ 1,533 వార్డుల్లో గెలుపొందింది. బీఆర్ఎస్ 775, బీజేపీ 330, ఇతరులు 173, ఎంఐఎం 70 వార్డుల్లో విజయం సాధించాయి. సీపీఐ 35, సీపీఐ(ఎం) 13 వార్డులు గెలిచాయి. ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికలు పార్టీ రహితంగా జరిగినప్పటికి ఆ పార్టీ బలపర్చిన వారే మూడింట రెండోంతుల మంది జయ కేతనం ఎగుర వేశారు. మున్సిపల్ ఎన్నికల్లోనూ సర్పంచ్ ఫలితాలే పునరావృతం అయ్యాయి. రామగుండం కార్పొరేషన్‌లో మొత్తం 60 వార్డుల్లో 30, మంచిర్యాలలో 60 డివిజన్లలో 46, నల్లగొండలో 48 వార్డుల్లో 27 స్థానాల్ని కాంగ్రెస్‌పార్టీ కైవసం చేసుకుంది. మహబూబ్ నగర్‌లో మొత్తం 60 స్థానాల్లో కడపటి వార్తలందే సరికి 43 స్థానాలకు ఫలితాలు వెల్లడయ్యాయి. అందులో కాంగ్రెస్‌కు 24 స్థానాలు దక్కాయి. నిజామాబాద్, కరీం నగర్‌లలో బీజేపీ మెజార్టీ స్థానాలను దక్కించుకున్నా మేజిక్ ఫిగర్‌ను అందుకోలేకపోవడం తో ఇక్కడ మేయర్ ఎన్నిక రసవత్తరంగా మారనుంది. ఇండిపెండెంట్లు, ఇతర పార్టీల అభ్యర్థుల మద్దతు కోసం ఆ పార్టీ పావులు కదుపుతోంది. కొత్తగూడెంలో ఒంటరిగా పోటీ చేసిన సీపీఐ మెజార్టీ స్థానాలను దక్కించుకుంది. మొత్తం 60 స్థానాల్లో కాంగ్రెస్, సీపీఐ చెరో 22 డివిజన్లలో విజయం సాధించారు. ఇక్కడ బీఆర్ఎస్ 8 స్థానాలను గెలిచి, సీపీఐకి మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించింది. దీనితో కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ సీపీఐ వశం అయ్యింది. కాంగ్రెస్‌పార్టీ నేరేడుచర్ల, హుజూర్‌నగర్, హాలియా, కోదాడ, నందికొండ, చండూరు, చిట్యాల, భూత్పూర్, ధర్మపురి, భీంగల్, బిచ్కుంద, బాన్సువాడ, ఎల్లారెడ్డి, చొప్పదండి, సుల్తానాబాద్, చెన్నూరు, మంథని, హుస్నాబాద్, మరిపెడ, డోర్నకల్, నారాయణఖేడ్, సంగారెడ్డి, ఆందోలుజోగిపేట, సదాశివపేట, రామాయంపేట, హుజూరాబాద్, కొల్లాపూర్, కల్వకుర్తి, మద్దూరు, పెబ్బేరు, స్టేషన్‌ఘన్‌పూర్, మధిర, అశ్వారావుపేట, ఇల్లెందు, ములుగు, యాదిగిరిగుట్ట, ఆలేరు మున్సిపాల్టీల్లో స్పష్టమైన మెజారిటీ సాధించింది. గడ్డపోతారం, ఇంద్రేశం, అయిజ, తొర్రూర్, ఇబ్రహీంపట్నం, తిరుమలగిరి, ఆమన్‌గల్, సిరిసిల్ల సహా మొత్తం 14 మున్సిపాల్టీలను బీఆర్ఎస్ వశం చేసుకుంది. జోగులాంబ గద్వాల జిల్లాలోని వడ్డేపల్లి మున్సిపాల్టీలో ఫార్వర్డ్ బ్లాక్ మెజార్టీ స్థానాలను దక్కించుకుంది. దేవరకద్ర, అలంపూర్, దేవరకొండ, ఆలియాబాద్, కోహీర్, కేసముద్రం, ఆసిఫాబాద్, అమరచింత, గద్వాల, క్యాతనపల్లి, జనగామ, జిన్నారం, నర్సాపూర్, జమ్మికుంట, వేములవాడ, రాయికల్, జహీరాబాద్, బెల్లంపల్లిల్లో ఏపార్టీకి స్పష్టమై మెజార్టీ రాలేదు. ఇండిపెండెంట్లు ఇతర పార్టీల అభ్యర్థుల మద్దతుపై ఇక్కడ ఎవరికి అధికారం దక్కనుందో ఈ నెల 13న తేలనుంది.

**క్యాంపులు నడిపితే చర్యలు : ఎస్ఈసీ**

క్యాంప్ రాజకీయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్లను ఎన్నికల సంఘం ఆదేశించింది. నిఘా, తనిఖీ బృందాలను మరింత అప్రమత్తం చేయాలని సూచించింది. ఈనెల 16న ఛైర్‌పర్సన్లు, మేయర్ల ఎన్నికలు ముగిసే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని ఎస్ఈసీ స్పష్టం చేసింది. ఎన్నిక ధ్రువపత్రం స్వయంగా విజేతలకే అందచేయాలని తెలిపింది. ఎన్నికల కోడ్‌కు కట్టుబడి ఉంటామని విజేతలు డిక్లరేషన్ ఇవ్వాలని ఆదేశించింది. బీఎన్ఎస్ఎస్ 163 సెక్షన్ అమల్లో ఉంటుందనీ, ముగ్గురికి మించి గుంపుగా ఉండరాదని పేర్కొంది.

## ముగిసిన పార్లమెంట్ సమావేశాలు

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వం జాతీయ ప్రయోజనాలను, భద్రతను తాకట్టు పెట్టిందని ప్రతిపక్షాలు నిరసనలు వ్యక్తం చేసిన తొలి దశ బడ్జెట్ సమావేశాలు శుక్రవారంతో ముగిశాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానం, కేంద్ర బడ్జెట్‌పై చర్చ ఉభయ సభల్లో జరిగింది. ఈ రెండు అంశాలపై చర్చల సందర్భంగా ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు నిలదీశాయి. లోక్‌సభలో ఇండస్ట్రియల్ రిలేషన్ కోడ్ బిల్లు ఆమోదం పొందింది.

**మార్చి 9 నుంచి రెండో దశ**

మార్చి 9న ప్రారంభ కానున్న రెండో దశ బడ్జెట్ సమావేశాలు ఏప్రిల్ 2 వరకు కొనసాగుతాయి. శుక్రవారంనాడు ప్రతిపక్షాలు పార్లమెంటు లోపల, వెలుపల ఆందోళన చేపట్టాయి. ఇండియాఅమెరికా వాణిజ్య ఒప్పందంలోని రహస్యాలను తొలగించడం, ఆర్మీ మాజీ చీఫ్ ఎంఎం నరవాణే పుస్తకంలోని వివాదాస్పద భాగాలను చర్చించడం, తీవ్ర సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ ఫైళ్లలో ప్రధానమంత్రి, కేంద్ర మంత్రుల పేర్లు ప్రస్తావనకు రావడం వంటి అంశాలను ప్రతిపక్షాలు లేవనెత్తాయి.

* **నా ప్రసంగంలో ఎక్కువ భాగం రికార్డు నుంచి తొలగించడం సరికాదు : ఖర్గే**

రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదం తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా తన ప్రసంగంలో ఎక్కువ భాగాన్ని రికార్డు నుంచి తొలగించాలనే చర్యను రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే వ్యతిరేకించారు. రాజ్యసభ చైర్మెన్ సి.పి రాధాకృష్ణన్ ఈ చర్యను ఉపసంహరించుకోవాలన్న ఖర్గే డిమాండ్‌ను తిరస్కరించారు.

## బలపడిన భారత పాస్‌పోర్ట్.. 75వ స్థానానికి జంప్

ప్రపంచంలోని అత్యంత శక్తిమంతమైన పాస్‌పోర్ట్‌ల జాబితాలో భారత్ తన స్థానాన్ని గణనీయంగా మెరుగుపరచుకుంది. హెన్లీ పాస్‌పోర్ట్ ఇండెక్స్ తాజాగా విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో భారత పాస్‌పోర్ట్ 75వ స్థానంలో నిలిచింది. గతేడాది 85వ స్థానంలో ఉన్న భారత్, ఈసారి ఏకంగా 10 స్థానాలు ఎగబాకడం విశేషం. ఈ తాజా ర్యాంకు ప్రకారం భారత పాస్‌పోర్ట్ ఉన్నవారు ముందస్తు వీసా అవసరం లేకుండా 56 దేశాలకు ప్రయాణించే వీలుంది. అంతర్జాతీయంగా భారతీయులకు ప్రయాణ సౌలభ్యం పెరిగిందనడానికి ఈ మెరుగైన ర్యాంకే నిదర్శనం. అయితే, గతంతో పోలిస్తే భారత్ మెరుగైనప్పటికీ ఇది అత్యుత్తమ ర్యాంకు కాదు. 2006లో భారత్ 71వ స్థానాన్ని సాధించడమే ఇప్పటివరకు అత్యుత్తమ ప్రదర్శన. 2024లో 80వ స్థానానికి, ఆ తర్వాత 85వ స్థానానికి పడిపోయిన భారత ర్యాంకు ఇప్పుడు తిరిగి పుంజుకుంది.

## నల్లమలసాగర్‌పై తెలంగాణ అభ్యంతరం చెప్పడం తగదు: సీఎం చంద్రబాబు

అమరావతి: పోలవరం నల్లమలసాగర్ అనుసంధాన ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేయడం సమర్థనీయం కాదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. శుక్రవారం అసెంబ్లీ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఏటా 3,500 టీఎంసీల గోదావరి వరద నీరు సముద్రంలోకి వృథాగా పోతోందని, అందులోంచి 200 టీఎంసీల నీటిని నల్లమలసాగర్‌కు తరలించాలని ప్రభుత్వం యోచిస్తోందని తెలిపారు. తెలుగు రాష్ట్రాలు నీటిని పొదుపుగా వాడుకోవాలని, ఈ ప్రాజెక్టుకు అడ్డుపడటం సరైన పద్ధతి కాదని హితవు పలికారు. 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసి జాతికి అంకితం చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. మూడేళ్లలో ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాజెక్టులను పూర్తిచేస్తామని, పోలవరాన్ని వంశధారతో అనుసంధానిస్తామని హామీ ఇచ్చారు. గడిచిన 20 నెలల్లో తమ సంకీర్ణ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంలో గణనీయమైన ప్రగతి సాధించిందని, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుందని వివరించారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల ఎదురైన ఇబ్బందులను అధిగమించిన తీరును, అభివృద్ధిని అడ్డుకోవడానికి జరుగుతున్న కుట్రలను సభలో ప్రస్తావించారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కలిసికట్టుగా పనిచేస్తున్నాయని సీఎం తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో జరిగిన విధ్వంసంపై ఏడు శ్వేతపత్రాలు విడుదల చేశామన్నారు. పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ ముందుందని, గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ సంస్థలు విశాఖకు వస్తున్నాయని చెప్పారు. అనకాపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, రామాయపట్నం వద్ద రూ.70,000 కోట్లతో బీపీసీఎల్ రిఫైనరీ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని కచ్చితంగా నెరవేరుస్తామని చంద్రబాబు భరోసా ఇచ్చారు. ప్రజారోగ్య సేవలను మెరుగుపరిచేందుకు 'సంజీవని' ప్రాజెక్టును తీసుకొస్తున్నామని, ఇందులో భాగంగా గేట్స్ ఫౌండేషన్ సహకారంతో డిజిటల్ హెల్త్ రికార్డులు రూపొందిస్తామని తెలిపారు. ఈ నెల 16న బిల్ గేట్స్ రాష్ట్ర పర్యటనకు రానున్నారని ముఖ్యమంత్రి వెల్లడించారు.

## వరల్డ్ రేడియో డే...
## డిజిటల్ యుగంలోనూ ఉనికిని చాటుకుంటున్న రేడియో

ఢిల్లీ: సోషల్ మీడియా, టెలివిజన్, స్మార్ట్‌ఫోన్‌ల యుగంలోనూ రేడియో తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటోంది. ఇవాళ (ఫిబ్రవరి 13) ప్రపంచ రేడియో దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఈ మాధ్యమం ప్రాధాన్యం మరోసారి చర్చనీయాంశమైంది. 'రేడియో, కృత్రిమ మేధస్సు' (Radio and Artificial Intelligence) అనే ఈ ఏడాది థీమ్.. సంప్రదాయ ప్రసార మాధ్యమానికి, ఆధునిక సాంకేతికతకు మధ్య మారుతున్న సంబంధాన్ని స్పష్టం చేస్తోంది. తరతరాలుగా సమాచారం, విద్య, వినోదాన్ని అందించే శక్తివంతమైన మాధ్యమంగా రేడియో నిలిచింది. ఉదయాన్నే భక్తి గీతాల నుంచి వార్తా బులెటిన్లు, ఇంటరాక్టివ్ కార్యక్రమాల వరకు దేశంలోని ప్రతి ఇంట్లో ఇది ఒక నమ్మకమైన నేస్తంగా కొనసాగుతోంది. నేటికీ చిన్న చిన్న దుకాణాలు, ఆటోరిక్షాలు, పెట్రోల్ పంపులలో రేడియో శబ్దం వినిపిస్తూనే ఉండటం సమాజంలో దానికున్న ఆదరణకు నిదర్శనం. ముఖ్యంగా గ్రామీణ, చిన్న పట్టణ ప్రాంతాల్లో వ్యవసాయం, ఆరోగ్యం, సైన్స్ వంటి కీలక సమాచారాన్ని అందించడంలో రేడియో విశ్వసనీయతను చాటుకుంటోంది. రేడియోకు మళ్లీ ప్రాచుర్యం కల్పించడంలో ప్రధాని నరేంద్ర మోదీ నెలవారీ కార్యక్రమం 'మన్ కీ బాత్' కీలక పాత్ర పోషించిందని చెప్పవచ్చు. ఈ కార్యక్రమం రేడియోను మళ్లీ జాతీయ స్థాయిలో చర్చకు తీసుకువచ్చింది. కుటుంబాలు, సంఘాలు కలిసికట్టుగా రేడియో వినే సంస్కృతిని ప్రోత్సహించింది. 'పరీక్షా పే చర్చ' వంటి కార్యక్రమాలు యువ శ్రోతలను కూడా ఈ వేదికకు దగ్గర చేశాయి. ఆకాశవాణి హజారీబాగ్ కేంద్రానికి చెందిన అల్కా కుమారి, ప్రకాశ్ రాణా మాట్లాడుతూ.. రేడియో సులభంగా అందుబాటులో ఉండే మాధ్యమమని, ప్రజలతో అనుసంధానమై ఉందని తెలిపారు. 'కిసాన్ వాణి' కార్యక్రమంతో సంబంధం ఉన్న రాణా, రేడియో.. రైతులు, విద్యార్థులు, వ్యాపారులు, సైనికులకు అవసరమైన సమాచారాన్ని అందిస్తోందని వివరించారు. ఇంటర్నెట్ రాకముందు దేశంలో భౌగోళిక దూరాలను చెరిపేయడంలో రేడియోనే అత్యంత ప్రభావవంతమైన సాధనంగా ఉండేదని ఆకాశవాణి సీనియర్ అనౌన్సర్ రాజీవ్ కుమార్ గుర్తుచేశారు. 1946 ఫిబ్రవరి 13న ఐక్యరాజ్యసమితి రేడియో ప్రారంభమైనందుకు గుర్తుగా, 2011లో యునెస్కో ఈ తేదీని ప్రపంచ రేడియో దినోత్సవంగా ప్రకటించింది. ఆ తర్వాత 2012లో ఐరాస సర్వసభ్య సమావేశం దీనిని ఆమోదించింది. కాలం, సాంకేతికత మారినా రేడియో ప్రాముఖ్యత చెక్కుచెదరలేదు. డిజిటల్ యుగంలోనూ సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు విశ్వసనీయమైన, ప్రభావవంతమైన మాధ్యమంగా రేడియో తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది.

## ఒకే కాలనీలో
## 6 పార్కులను కాపాడిన హైడ్రా

హైదరాబాద్: హైదరాబాద్ నగరంలో ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన పార్కుల స్థలాల కబ్జాపై హైడ్రా ఉక్కుపాదం మోపింది. ప్రజలకు ప్రాణవాయువును అందించే పచ్చని ప్రదేశాలను కాపాడేందుకు నడుం బిగించింది. శుక్రవారం ఒక్కరోజే రెండు వేర్వేరు ప్రాంతాల్లో మెరుపు దాడులు నిర్వహించి సుమారు రూ. 34.12 కోట్ల విలువైన 3,041 గజాల పార్కు స్థలాలను కబ్జాదారుల చెర నుంచి విడిపించింది. హైడ్రా తీసుకున్న ఈ చర్యలతో స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు.

* **భాగ్యలక్ష్మి కాలనీలో 6 పార్కులకు విముక్తి**

మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా, కుత్బుల్లాపూర్ పరిధిలోని సుభాష్ నగర్‌లో ఉన్న భాగ్యలక్ష్మి కాలనీలో హైడ్రా అధికారులు కీలక ఆపరేషన్ చేపట్టారు. 1968లో వేసిన ఈ లేఅవుట్‌లో పార్కుల కోసం కేటాయించిన స్థలాలు కాలక్రమేణా కబ్జాకు గురయ్యాయి. గతంలో ఈ ప్రాంతం మీదుగా వెళ్లే హైటెన్షన్ విద్యుత్ లైన్లను 20 ఏళ్ల క్రితం తొలగించడంతో, అప్పటి నుంచి పార్కుల స్థలాలు ఆక్రమణకు గురవుతూ వచ్చాయి. స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో, నివాసితులు హైడ్రా ప్రజావాణిని ఆశ్రయించారు. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన అధికారులు, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఆక్రమణలను నిర్ధారించుకున్నారు. శుక్రవారం ఒకేసారి 6 పార్కులలోని ఆక్రమణలను తొలగించి, 2260 గజాల స్థలానికి 'హైడ్రా ఫెన్సింగ్' వేసి, అధికారిక బోర్డులు ఏర్పాటు చేశారు. దీంతో కాలనీవాసులు ఆనందంతో ర్యాలీలు తీసి, హైడ్రాకు అనుకూలంగా నినాదాలు చేశారు.

* **గుడిమల్కాపూర్‌లో పార్కుకు విముక్తి**

ఇదే తరహాలో, ఆసిఫ్‌నగర్ మండలం గుడిమల్కాపూర్ గ్రామంలోని ఏజీ ఆఫీస్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఅవుట్‌లో దశాబ్దాలుగా కబ్జాలో ఉన్న పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది.

## లక్షల మంది కార్యకర్తల శ్రమ ఫలితమిది

హైదరాబాద్: 'రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని కట్టబెట్టిన రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక ధన్యవాదాలు' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం సీఎం ఒక ప్రకటన విడుదల చేశారు. ''ఈ విజయం లక్షల మంది కాంగ్రెస్ కార్యకర్తల శ్రమ ఫలితం. పార్టీపై వారికి ఉన్న అనంతమైన అభిమానానికి నిదర్శనం. భుజాలు కాయలు కాసేలా పార్టీ జెండాను మోసి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లిన ప్రతి కార్యకర్తకు ఈ విజయం అంకితం. రాష్ట్రంలో రెండేళ్ల ప్రజాపాలన, పేదమధ్య తరగతి ప్రజల సంక్షేమం, ప్రపంచస్థాయి ప్రణాళికలు, కార్యాచరణతో ప్రజాప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఓటర్లు ఈ తీర్పు ద్వారా తమ సంపూర్ణ ఆమోదం తెలిపారు. ఈ విజయం మా బాధ్యతను మరింత పెంచింది. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, పారదర్శక పాలనకు పునరంకితమవుతూ.. భవిష్యత్తులో ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లను గొప్పగా అభివృద్ధి చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

**సీఎంకు ప్రియాంకాగాంధీ అభినందనలు**

ఈనాడు, దిల్లీ: తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ హర్షం వ్యక్తంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం దిల్లీలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా.. ఎన్నికల ఫలితాల గురించి వివరించగా ఆమె అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో ప్రజలు సంతృప్తిగా ఉన్నందున కాంగ్రెస్‌కు ఘన విజయం కట్టబెట్టారని ప్రియాంకాగాంధీకి సీఎం వివరించారు. ఈ సమావేశం తర్వాత ఆయన హైదరాబాద్‌కు తిరుగుపయనమయ్యారు.

## ఎంపీపై అనర్హత వేటు ప్రొసీజర్ ఇదే!

ఢిల్లీ: లోక్ సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ మండిపడుతోంది. అమెరికాతో కుదిరిన ట్రేడ్ డీల్ ను విమర్శిస్తూ.. దేశాన్ని అమెరికాకు అమ్మేశారంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించడాన్ని బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబె తీవ్రంగా పరిగణించారు. రాహుల్ గాంధీపై అనర్హత వేటు వేయాలని డిమాండ్ చేశారు. సభ నుంచి బహిష్కరించడంతో పాటు రాహుల్ గాంధీని జీవితకాలం పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధం విధించాలని కోరారు. సభ్యత్వ రద్దు ప్రక్రియను ప్రారంభించాలని కోరుతూ లోక్ సభలో నోటీసు ఇచ్చారు. ఈ క్రమంలో ఎంపీల సభ్యత్వాన్ని తొలగించే ప్రక్రియపై చర్చ జరుగుతోంది.

* **ఫిర్యాదు నోటీసులతో ప్రక్రియ ప్రారంభం..**

పార్లమెంట్ సభ్యుడికి వ్యతిరేకంగా సహచర సభ్యుడు లేదా పార్టీ అధికారికంగా ఫిర్యాదు చేయడంతో తొలగింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఈ ఫిర్యాదు (నోటీసు)ను స్పీకర్ ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేస్తారు. సభ్యుడిపై వచ్చిన ఆరోపణలపై కమిటీ విచారణ జరిపి స్పీకర్ కు నివేదిక సమర్పిస్తుంది. సదరు సభ్యుడిని దోషిగా తేల్చి, అతడిపై అనర్హత వేటు వేయాలని రికమెండ్ చేస్తే ఆ రిపోర్టును స్పీకర్ లోక్ సభలో చర్చకు పెడతారు. దీనికి మెజారిటీ సభ్యులు ఆమోదం తెలిపితే సదరు సభ్యుడిపై అనర్హత వేటు పడుతుంది.

## బంగ్లా పీఠంపై బీఎన్‌పీ

ఢాకా: బంగ్లాదేశ్‌లో దాదాపు ఏడాదిన్నరగా కొనసాగుతున్న రాజకీయ అస్థిరతకు తెరపడింది. దేశ 13వ సార్వత్రిక ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ) ఘన విజయం సాధించింది. మూడింట రెండు వంతుల స్థానాల్లో నెగ్గి.. రెండు దశాబ్దాల తర్వాత బంగ్లా అధికార పీఠాన్ని కైవసం చేసుకుంది. ఎన్నికలు జరిగిన 299 పార్లమెంటు స్థానాల్లో 209 సీట్లలో బీఎన్‌పీ విజయఢంకా మోగించింది. పాకిస్థాన్‌తో అత్యంత సన్నిహిత సంబంధాలున్న మతతత్వ పార్టీ జమాత్‌ఏఇస్లామీ 68 స్థానాలతో రెండో స్థానంలో నిలిచింది. మాజీ ప్రధాని ఖాలిదా జియా కుమారుడు, బీఎన్‌పీ ఛైర్మన్ తారిఖ్ రెహమాన్(60) దేశ నూతన ప్రధాన మంత్రిగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. చివరిసారిగా బీఎన్‌పీ 2001లో అధికారంలోకి వచ్చింది. 2006 వరకు కొనసాగింది. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీయే నెగ్గుతూ వచ్చింది. 2024 ఆగస్టులో జరిగిన విద్యార్థుల ఉద్యమంలో హసీనా ప్రభుత్వం కుప్పకూలిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి మహమ్మద్ యూనస్ నేతృత్వంలో తాత్కాలిక సలహా మండలి బంగ్లా పాలనను పర్యవేక్షిస్తూ వచ్చింది. గురువారం జరిగిన ఎన్నికల్లో 59.44 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల సంఘం తెలిపింది. ఎన్నికలతో పాటు.. జులై నేషనల్ ఛార్టర్‌గా పరిగణించే 84 పాయింట్ల సంస్కరణల ప్యాకేజీపైనా రిఫరెండం జరిగింది. సంస్కరణలకు అనుకూలంగా 60.26% ప్రజలు ఓటేశారని ఎన్నికల సంఘం సీనియర్ కార్యదర్శి అఖ్తర్ అహ్మద్ తెలిపారు.

## సేవా తీర్థ్‌లో ప్రతి క్షణం దేశ హితం కోసమే పనిచేస్తా

దిల్లీ: కొత్తగా నిర్మించిన ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) 'సేవా తీర్థ్'లో ప్రతి క్షణం దేశ హితం కోసమే పనిచేస్తానని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. వికసిత్ భారత్ దిశగా దేశ ప్రయాణంలో సేవా తీర్థ్‌తో పాటు కేంద్ర సచివాలయ భవనాలైన కర్తవ్య భవన్ 1, కర్తవ్య భవన్ 2ల ప్రారంభం కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. దేశ ప్రగతికి, పౌరులే కేంద్రంగా పరిపాలన సాగించాలన్న తమ ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇవి నిదర్శనాలని వ్యాఖ్యానించారు. దిల్లీలో సేవా తీర్థ్ సముదాయాన్ని ప్రధాని మోదీ శుక్రవారం ప్రారంభించారు. ఈ సముదాయంలో కొత్త పీఎంవో (సేవా తీర్థ్)తో పాటు కర్తవ్య భవన్ 1, కర్తవ్య భవన్ 2, జాతీయ భద్రతామండలి సచివాలయం ఉంటాయి. ''దేశ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకే సేవాతీర్థ్, కర్తవ్య భవన్‌లను నిర్మించాం. ఇక్కడ తీసుకునే నిర్ణయాలు 140 కోట్ల మంది భారతీయుల ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడానికి పునాదుల్లా పనిచేస్తాయి. బ్రిటిష్ హయాం నాటి భవనాలను చూస్తుంటే బానిసత్వపు ఆనవాళ్లు గుర్తుకొస్తాయి. సేవా తీర్థ్, కర్తవ్య భవన్‌లు మన స్వేచ్ఛ, స్వయంపాలనకు సంకేతాలు.

# మహాశివరాత్రి బాక్స్ క్రికెట్ టోర్నమెంట్ కు హజరుకావాలని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఆహ్వానం



కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, షాపూర్ నగర్ డివిజన్‌లో "పుప్పాల ఫౌండేషన్" ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ నిర్వహించనున్న మహాశివరాత్రి బాక్స్ క్రికెట్ టోర్నమెంట్ కు ముఖ్య అతిథులుగా హాజరుకావాలని శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ని, జిల్లా పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజులను మర్యాదపూర్వకంగా కలసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిహెచ్ఎంసి డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, ప్రసాద్ నాయుడు, ఎల్లేష్, కోలా శ్రీకాంత్, తాటి రవి కుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొని టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు

# ఆలయ కమాన్ ఏర్పాటుకు శంకుస్థాపన



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి ) : నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప లో వెలిసినటువంటి శ్రీశ్రీశ్రీ ఉమామహేశ్వర స్వామి , శ్రీశ్రీ నల్ల పోచమ్మ దేవాలయం నందు కమాన్ ప్రారంభోత్సావానికి ముఖ్య అతిథిగా ఆలయ ధర్మకర్త (ఆలయ చైర్మన్) కొలన్ శ్రీనివాస్ రెడ్డి , నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి లు పాల్గొని వారి చేతుల మీదుగా కామన్ శిలాఫలకాలను ప్రారంభించారు. అంతకు ముందు దేవత మూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పితాని శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు సరళ లక్ష్మణ్, జనరల్ సెక్రెటరీ ముద్దికుప్పం కుమార్ రెడ్డి, ట్రెజరర్ వివి రమణ, జాయింట్ సెక్రెటరీ దశరథ్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల రామకృష్ణ గుప్తా, ఎగ్జిక్యూటివ్ నెంబర్ సలాడి శివ, ఎగ్జిక్యూట్ నెంబర్, వై దాలి నాయుడు, ఎగ్జిక్యూట్ నెంబర్ ఎన్ బాలకృష్ణ , అంగ శ్రీనివాసరావు, ఏలూరి సత్య (నాని), బండ్ల విజయ్ కుమార్, లాలయ్య భక్తులు నిజాంపేట్ పెద్దలు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# 15వ డివిజన్‌లో ఆకునూరి సుప్రియ విజయోత్సవాలు



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన ఎన్నికల్లో 15వ డివిజన్ కార్పొరేటర్‌గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆకునూరి సుప్రియ విజయం సాధించడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా విజయోత్సవాలను నిర్వహించారు. ఫలితాల అనంతరం కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహిస్తూ పలు ప్రాంతాల్లో సంబరాలు చేసుకున్నారు. ముఖ్యంగా రామవరం బస్టాండ్ సెంటర్‌లో ఉన్న డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి నూతన కార్పొరేటర్ సుప్రియ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు నినాదాలతో ఆ ప్రాంతాన్ని హోరెత్తించారు. కార్యకర్తలు డప్పులు, బాణాసంచా కాల్చుతూ సంబరాలు జరుపుకున్నారు.

**అభివృద్ధే లక్ష్యం : సుప్రియ**

ఈ సందర్భంగా ఆకునూరి సుప్రియ మాట్లాడుతూ, తమపై విశ్వాసం ఉంచి గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. 15వ డివిజన్‌లో ప్రధాన సమస్యలను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తానని, అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. డివిజన్ అభివృద్ధికి ప్రజల సహకారం అవసరమని సుప్రియ అన్నారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేలా కృషి చేస్తామని, ప్రతి వర్గానికి అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా పనిచేస్తామని స్పష్టం చేశారు.

**కార్యకర్తల్లో ఉత్సాహం**

సుప్రియ విజయంతో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. భవిష్యత్తులో డివిజన్ అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తామని నాయకులు తెలిపారు.

# బజ్జీల విక్రేత.. నేడు విజేత!



నిన్నటిదాకా గుబిడే నాగుబాయి వేసే వేడివేడి బజ్జీలు తినడానికి ఇష్టపడ్డ జనం.. రేపట్నుంచి సమస్యలు పరిష్కరించమని కోరనున్నారు. అనుకోకుండా బరిలో దిగిన ఆమెను విజయం వరించింది. గూడెంలో ప్రతి ఒక్కరి అవసరాల్లో ముందుండే ఆమె.. దుర్గా, శారదాదేవి విగ్రహాల ప్రతిష్ఠ సమయంలో స్థానికుల్ని నడిపించేవారు. ఈసారి 19వ వార్డు జనరల్ మహిళకు రిజర్వు కావడంతో యువత, పెద్దలంతా కలిసి ఆమెను పోటీకి ఒప్పించారు. భారాస టికెట్ ఇచ్చింది. 58 ఓట్ల మెజారిటీతో గెలిచారు. మొదట్లో ఇళ్లలో సహాయకురాలిగా పని చేసిన నాగుబాయి.. ఈమధ్యే చిన్న బజ్జీల బండి ప్రారంభించారు.

# అందోలు–జోగిపేట మున్సిపాలిటీ కాంగ్రెస్‌దే

**–16 స్థానాల్లో కాంగ్రెస్ –మూడు స్థానాల్లో, బీఆర్ఎస్, ఒకచోట**

*** ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపు...**

అందోలు, ప్రజాస్ఫూర్తిః అందోలు-జోగిపేట మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది. 20 వార్డులకు గాను 7 కౌంటింగ్ టేబుల్‌లను ఏర్పాటు చేసి మూడు రౌండ్లలో ఓట్లను లెక్కించి ఫలితాలను విడుదల చేశారు. ఒక్కోరౌండ్‌లో 7 వార్డుల చొప్పున ఫలితాలను ప్రకటించారు. అందోలు-జోగిపేట మున్సిపాలిటీలో హస్తం హవా కొనసాగింది. మున్సిపాలిటీలో 20 వార్డులకు గాను 16 వార్డుల్లో కాంగ్రెస్, మూడు స్థానాల్లో బీఆర్ఎస్, ఒకరు స్వతంత్ర్య అభ్యర్థిగా గెలుపొందారు. గెలుపొందిన అభ్యర్థులకు అధికారులు ఎన్నిక ధృవీకరణ పత్రాలను అందజేశారు.

*** గెలుపొందిన అభ్యర్థులు వీరే:**

1వ వార్డు అరుణ్ కుమార్ (కాంగ్రెస్-265), 2వ వార్డు కొశికె రాజశేఖర్ (కాంగ్రెస్-221), 3వ వార్డు మర్రి అరుణ కుమారి (కాంగ్రెస్-146), 4వ వార్డు తిరుమల కల్పన (కాంగ్రెస్-302), 5వ వార్డు కొత్తగొల్ల మాధవి (కాంగ్రెస్-34), 6వ వార్డు రాచకొండ జ్యోతి ప్రదీప్‌గౌడ్ (కాంగ్రెస్-301), 7వ వార్డు తొట్ల రామకృష్ణ (కాంగ్రెస్-135), 8వ వార్డు నాగ రత్నంగౌడ్ (బీఆర్ఎస్-92), 9వ వార్డు హెచ్. శోభారాణి నారాయణగౌడ్ (బీఆర్ఎస్-57), 10వ వార్డు పి. రేఖా ప్రవీణ్ (కాంగ్రెస్-70), 11వ వార్డు జీ.కల్పన నాగరాజ్ (కాంగ్రెస్-28), 12వ వార్డు కొరబోయిన సరస్వతి (కాంగ్రెస్-195), 13వ వార్డు పి.శివశేఖర్ (బీఆర్ఎస్-288), 14వ వార్డు పి. ఉర్మిళ దుర్గయ్య (స్వతంత్ర అభ్యర్థి-83), 15వ వార్డు ఆకుల సత్యనారాయణ చిట్టిబాబు (కాంగ్రెస్-205), 16వ వార్డు పి.శ్రీనివాస్ (కాంగ్రెస్-



333), 17వ వార్డు నేనావత్ మేఘరాణి (కాంగ్రెస్-186), 18వ వార్డు బేగరి శశిరేఖ అనిల్ ( కాంగ్రెస్-252), 19వ వార్డు అల్లె మంజుల శ్రీకాంత్ (కాంగ్రెస్-131), 20వ వార్డు సోమిరెడ్డి గారి కృష్ణారెడ్డి (కాంగ్రెస్-208)లు కౌన్సిలర్‌లుగా గెలుపొందారు.

*** సంబరాల్లో పాల్గొన్న మంత్రి దామోదర్**

అందోలు-జోగిపేట మున్సిపాలిటీ కాంగ్రెస్ అత్యధిక స్థానాల్లో గెలుపొందడంతో పట్టణంలో సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సంబరాల్లో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. పట్టణంలో బస్వేశ్వర, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డీజే సౌండ్, బ్యాండ్ చప్పుళ్లలు, బాణాసంచాలను కాలుస్తూ కాంగ్రెస్ పార్టీ సంబరాలను నిర్వహించింది. మంత్రి దామోదర్ ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులతో కలిసి ప్రజలకు అభివాదం చేసుకుంటూ ఈ విజయోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.

# అందోల్ జోగిపేట మున్సిపల్ కాంగ్రెస్ కైవసం..



అందోలు, ప్రజాస్ఫూర్తి: అందోలు జోగిపేట మున్సిపల్ లో మొత్తం 20 వార్డులకు గాను కాంగ్రెస్ 16, బిఆర్ఎస్ 03, ఇండిపెండెంట్ 01 వార్డులు కైవసం చేసుకున్నాయి. శుక్రవారం స్థానిక మహిళ పాలిటెక్నిక్ కౌంటింగ్ నిర్వహించారు. వార్డు విజేత మెజారిటీ 1. గడ్డి అరుణ్. కాంగ్రెస్. 265, 2. కోశికే రాజశేఖర్ కాంగ్రెస్. 221, 3. మర్రి అరుణ కుమారి. కాంగ్రెస్. 146, 4 తిరుమల కల్పన. కాంగ్రెస్. 302, 5. కొత్తగొల్ల మాధవి కాంగ్రెస్. 34, 6. రాచకొండ జ్యోతి కాంగ్రెస్. 301, 7. తోట్ల రామకృష్ణ. కాంగ్రెస్. 135, 8. రాచకొండ నాగరత్నం గౌడ్ బీఆర్ఎస్. 92, 9. హనుమంతరావు పేట శోభా రాణి బీఆర్ఎస్. 57, 10. పట్లోళ్ల రేఖా ప్రవీణ్. కాంగ్రెస్. 70, 11. గూడెం కల్పన. కాంగ్రెస్. 28, 12. కోరబోయిన సరస్వతి కాంగ్రెస్ 195, 13. పట్లూరి శేఖర్.బీఆర్ఎస్. 288,14.పి. ఊర్మిళ. ఇండిపెండెంట్ 83, 15 ఆకుల చిట్టిబాబు. కాంగ్రెస్. 205, 16 పట్లోళ్ల శ్రీనివాస్. కాంగ్రెస్. 333, 17. నేనావత్ మేఘరాణి. కాంగ్రెస్. 186, 18. బేగరి శశిరేఖ. కాంగ్రెస్. 252,19. అల్లె మంజుల కాంగ్రెస్..131 20. సోమిరెడ్డి గారి కృష్ణారెడ్డి.. కాంగ్రెస్ 208



# విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించాలి

*** బిఆర్ఎస్ యువ నాయకుడు నోమన్నగారి ధీరజ్ రెడ్డి**

అందోలు, ప్రజాస్ఫూర్తి: విద్యార్థులు బాగా చదివి మంచి మార్కులు సాధించాలని బిఆర్ఎస్ యువ నాయకుడు నోమన్నాగారి ధీరజ్ రెడ్డి అన్నారు. శుక్రవారం అందోలు మండలంలోని కన్ సాన్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రాబోయే పదవ తరగతి విద్యార్థుల పరీక్షల కోసం అవసరమైన సామాగ్రి పరీక్ష ప్యాడ్ లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి జీవితంలో పదవ తరగతి చాలా కీలకమైందని రాబోయే వార్షిక పరీక్షలకు ఉపాధ్యాయుల సూచనలతో సరైన విధంగా ప్రిపరేషన్ కొనసాగించి మంచి మార్కులు సాధించాలని ఆకాక్షించారు. వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మొదటి బహుమతిగా రూ. 5వేల నగదు, రెండవ బహుమతిగా రూ.2500, మూడవ బహుమతిగా రూ.1000 అందిస్తామని తెలిపారు. గ్రామంలో ని విద్యార్థుల విద్యాభివృద్ధికి తనవంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. విద్యార్థులు పరీక్షల సమయంలో సోషల్ మీడియా కి దూరంగా ఉండి పట్టుదలతో చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఉన్నత లక్ష్యంతో చదివినప్పుడే మంచి స్థాయికి ఎదగగలుగుతారన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభద్రదేవి, మాజీ సర్పంచ్ లు, శేరి మాణిక్ రెడ్డి, యాధాగౌడ్, బిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షుడు గజేందర్ రెడ్డి, వార్డు సభ్యులు ఎర్రగోళ్ల శివ చందర్ , నాయకులు , ప్రదీప్ రెడ్డి,భూమయ్య, యువకులు దేవునూరి కృష్ణ, అసిఫ్,బీ. కృష్ణ ,చిలకంటి మాణిక్యం,సాయి కిరణ్ రెడ్డి, నాయకుని భరత్,ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

# శ్రీ అష్టలక్ష్మి దేవాలయం లో మహిళలు తో కుంకుమార్చన

మల్కాజిగిరి, ప్రజాస్ఫూర్తి : ఆర్కే హెచ్ కాలనీ శ్రీ అష్టలక్ష్మీ దేవాలయంలో ఈరోజు శుక్రవారం సందర్భంగా మహిళా భక్తుల చే సామూహిక కుంకుమ అర్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమాన్ని జి ఆర్ టి జువెల్లర్స్ వారు ఘనంగా ఏర్పాటు చేశారు. మాఘమాసం సందర్భంగా నిర్వహించిన ఈ కుంకుమ అర్చనకు అధిక సంఖ్యలో మహిళా భక్తులు హాజరై అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. దేవాలయ ప్రాంగణం భక్తుల నామస్మరణలు, మంత్రోచ్చారణలతో మార్మోగుతూ అంగరంగ వైభవంగా కుంకుమ అర్చన జరిపించారు. కార్యక్రమంలో సుజాత జాయింట్ సెక్రటరీతో పాటు ఇతర ప్రముఖులు, మరియు విశిష్ట అతిథులు పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



# యోగతో మానసిక ఒత్తిడిని నివారించవచ్చు

**: డాక్టర్ ఉమాశ్రీ**



ప్రజాస్ఫూర్తి జన్నారం : మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని తపాలాపూర్ గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం రోజున జన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ ఉమాశ్రీ సందర్శించారు ఈ సందర్భంగా తాను మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు (స్ట్రెస్ మేనేజ్మెంట్ )మానసిక ఒత్తిడికి గురికాకుండా పరీక్షలకు ఏ విధంగా ప్రిపేర్ కావాలి,పరీక్షలకు వెళ్లే ముందు తీసుకోవలసిన జాగ్రత్తలు,సానుకూల దృక్పథం తో పరీక్షలు రాయాలని ,సరైన నిద్ర మంచి ఆహారం,యోగ వల్ల మానసిక ఒత్తిడిని నివారించవచ్చునని విద్యార్థులకు తెలియజేశారు. పరీక్ష ఫలితాలు ఏ విధంగా వచ్చినా సానుకూల దృక్పథం తో ఉండాలని కోరారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటశాల పరిసరాలను పరిశీలించి నిర్వాహకులకు పరిశుభ్రతపై పలు సూచనలు ఇచ్చారు . ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ జంగమ్మ, ఎం.ఎల్.హెచ్.పి సందీప్, హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్, ఆశా కార్యకర్త లలిత, పాఠశాల ఉపాధ్యాయులు చంద్రిక, గోపాల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# 18వ డివిజన్ లో ఏఐఎఫ్ బి అభ్యర్థి గెలుపు

*** 171 ఓట్లతో ఆలకుంట్ల ఝాన్సీ నాగరత్నం రాజు ఘన విజయం ..**



ప్రజాస్ఫూర్తి, నల్గొండ: నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల కౌంటింగ్ శుక్రవారం నల్గొండ జిల్లా కేంద్రంలో జరిగింది. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 18 వ డివిజన్ లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి పోటీ చేసిన పాలకుంట్ల ఝాన్సీరాణి నాగరత్నం రాజు విజయం సాధించారు. ఈ డివిజన్లో మొత్తం 27 07 ఓట్లు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ సింహం గుర్తుకు 13 18 ఓట్లు రాగా, కాంగ్రెస్ అభ్యర్థికి 11 47, బిఆర్ఎస్ అభ్యర్థికి 137, బిజెపి అభ్యర్థికి 105 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థిపై ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి ఆలకుంట్ల ఝాన్సీరాణి 171 ఓట్లతో విజయదుందుభి మోగించారు. ఝాన్సీ రాణి గెలుపు పట్ల కాలనీవాసులు శుభాకాంక్షలు, ఈ సందర్భంగా కార్పొరేటర్ గా గెలిచిన ఆలకుంట్ల ఝాన్సీ నాగరత్నం రాజు మాట్లాడుతూ జన ప్రజలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. డివిజన్ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ఇచ్చిన పాట ప్రకారం అభివృద్ధి పనులకు కృషి చేస్తానని తెలిపారు.

# ఒక్క ఓటు మ్యాజిక్



'పుర' ఎన్నికల ఓట్లు లెక్కింపు ఉత్కంఠగా సాగింది. విజయం దోబూచులాడిన చోట్ల అభ్యర్థులు రీకౌంటింగ్‌కు పట్టుబట్టడంతో అధికారులు తిరిగి ఓట్లు లెక్కించారు. ఈ క్రమంలో చాలామంది ఒక్క ఓటు తేడాతో తమ ప్రత్యర్థులపై విజయం సాధించారు. మిర్యాలగూడ 18వ వార్డులో 1,711 ఓట్లు పోల్ కాగా కాంగ్రెస్ అభ్యర్థి బూడిద సైదులుకు 837 ఓట్లు, భారాస అభ్యర్థి వినోద్‌కుమార్‌కు 836 ఓట్లు వచ్చాయి. రీకౌంటింగ్‌లోనూ అదే పునరావృతం కావడంతో సైదులు ఒక్క ఓటుతో విజయం సాధించారు. పరకాల మున్సిపాలిటీ 17వ వార్డులో 836 ఓట్లు పోలయ్యాయి.

# సైబరాబాద్ లో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికల కౌంటింగ్

సైబరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : సైబరాబాద్ లో శుక్రవారం మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా ముగిసింది. కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని ఎల్లంపేట మున్సిపాలిటీకి సంబంధించిన డబీల్‌పూర్ భారత్ బైబిల్ కాలేజీ కౌంటింగ్ కేంద్రం, అలాగే అలియాబాద్ మున్సిపాలిటీకి సంబంధించి మజీద్‌పూర్ టి శ్రీ చైతన్య స్కూల్ లో కౌంటింగ్ నిర్వహించారు. అలాగే శేరిలింగంపల్లి జోన్ పరిధిలోని ఇస్నాపూర్ మున్సిపాలిటీకి సంబంధించి జెడ్పీహెచ్‌ఎస్ ఇస్నాపూర్ కౌంటింగ్ కేంద్రంలోనూ, గడ్డపోతారం మున్సిపాలిటీకి సంబంధించి గడ్డపోతారం జెడ్పీహెచ్‌ఎస్ కౌంటింగ్ కేంద్రంలోను, ఇంద్రేశం మున్సిపాలిటీకి సంబంధించి పెదకంజర్ల సోషల్ వెల్ఫేర్ స్కూల్ హాల్లో కౌంటింగ్ నిర్వహించారు. అన్ని కౌంటింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా కౌంటింగ్ ముగిసింది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఈ నెల 16వ తేదీ వరకు అమల్లో ఉంటుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా ప్రశాంతంగా ముగిశాయి. మున్సిపల్ ఎన్నికల బందోబస్తు విధుల్లో పాల్గొన్న పోలీస్ సిబ్బందిని సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ అభినందించారు.

# జగద్గిరిగుట్ట ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటా..

* జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్



జగద్గిరిగుట్ట, ప్రజాస్ఫూర్తి : జగద్గిరిగుట్ట ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆశీస్సులతోనే మూడు పర్యాయాలు హ్యాట్రిక్ కార్పొరేటర్ గా గెలిపించినందుకు పాదాభివందనాలు తెలియజేసుకుంటూ.. రాజకీయంగా విశిష్ట సేవలందించడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను తల్లిదండ్రులు కొలుకుల (బండి )సత్యనారాయణ కొలుకుల లక్ష్మి లు నాకు జన్మనిస్తే.. జగద్గిరిగుట్ట డివిజన్ పురప్రజలు రాజకీయంగా నాకు పునర్జన్మని ఇచ్చారన్నారు. .శ్రీ వెంకటేశ్వర స్వామి,శివయ్య దీవెనలతో జగద్గిరిగుట్ట ప్రజల కుటుంబ సభ్యుడిగా మెదిలే గొప్ప భాగ్యం నాకు కలిగింది.. రాజకీయంగా ఎన్నో సవాళ్లు, ఆటుపోట్ల ఎదుర్కొంటూ మన డివిజన్ ప్రజలే నా బలం..బలగం..అంటూ నేటి వరకు ముందుకు సాగాను.. భవిష్యత్తులో కూడా మీకు సేవలు చేయాలనే దృఢ సంకల్పంతో,మీ ఆదరాభిమానాలతో ముందుకు రావాలని అనుకుంటున్నాను..

# 'గూడెం'లో హంగ్..

* మెజారిటీ సీట్లు కైవసం చేసుకోని పార్టీలు
* సీపీఐకి బీఆర్ఎస్ మద్దతు: కేటీఆర్

ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఎన్నికలు ముగిశాయి... ఓట్ల లెక్కింపు పూర్తయింది.. ఇక మిగిలింది మేయర్‌ను ఎన్నుకోవడమే. మ్యాజిక్ ఫిగర్ వస్తే అంతా మామూలుగానే ఉండేది... కాని ఇక్కడ ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ లేకపోవడంతో ఇప్పుడు రాష్ట్రంలోని అందరిచూపు కొత్తగూడెం కార్పొరేషన్‌పై పడింది. కొత్తగూడెం కార్పొరేషన్ తొలి పాలకవర్గం ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఈనెల 11న మొత్తం 60 కార్పొరేట్ స్థానాలకు ఎన్నికలు జరుగగా మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు ఏ పార్టీకి అవసరమైన మెజారిటీ స్థానాలు రాకపోవడంతో హంగ్ ఏర్పడింది. దీంతో 'గూడెం' కార్పొరేషన్ పాలకవర్గం ఏర్పాటుకు ఎక్కువ స్థానాలు సాధించిన కాంగ్రెస్, సిపిఐలు బేరసారాలు ప్రారంభించాయి. కాంగ్రెస్, సిపిఐ పార్టీలకు చెరో 22 స్థానాలు రావడంతో కార్పొరేట్ పీఠం దక్కించుకోవాలంటే మరో 9 మంది కార్పొరేటర్ల మద్దతు అవసరం ఉంది. అయితే రాష్ట్రంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని పోటీ చేసిన కాంగ్రెస్, సిపిఐలు ఈ కార్పొరేషన్ ఎన్నికల్లో ఏమాత్రం పెడమొహం పెడమొహం ఉండటంతో కార్పొరేషన్ ఎన్నికల్లో విడివిడిగా పోటీ చేశారు. రెండురోజుల క్రితం కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు దౌర్జన్యం చేస్తున్నారంటూ స్వయంగా కొత్తగూడెం ఎమ్మెల్యే (సిపిఐ) కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇకపై తామేంటో చూపిస్తామని, నేను పిల్లిని కాదు.. పులిని అంటూ వ్యాఖ్యానించడం దుమారం రేపిన సంగతి తెలిసిందే.

* సీపీఐకి మద్దతు ప్రకటించిన బీఆర్ఎస్

కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ పీఠం దక్కించుకునేందుకు సీపీఐ పార్టీకి మరో 9 మంది కార్పొరేటర్ల మద్దతు అవసరం ఉండగా బీఆర్ఎస్ పార్టీ సీపీఐకి మద్దతు ఇస్తుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) ప్రకటించారు. సింగరేణిలో జరుగుతున్న బొగ్గు కుంభకోణాలను వెలికి తీయడానికి కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని, ఈ మేరకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో చర్చించినట్లు మీడియా సమావేశంలో కేటీఆర్ వెల్లడించారు. అదేవిధంగా కాంగ్రెస్, బీజేపీల ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడమే లక్ష్యంగా ఈ ప్రతిపాదన చేశానని చెప్పారు. 8 స్థానాల్లో విజయం సాధించిన బీఆర్ఎస్ మద్దతుతో సీపీఐ పార్టీ మ్యాజిక్ ఫిగర్‌కు మరొక కార్పొరేటర్ మద్దతు అవసరం ఉంది. అయితే ఇండిపెండెంట్‌గా గెలిచిన 6 గురిలో లేదా ఒక్కో స్థానం సాధించిన సీపీఎం, బీజేపీల మద్దతు ఉంటుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. మేయర్ ఎన్నిక నాటికి ఈ విషయంలో ఒక స్పష్టత వచ్చే అవకాశం కన్పిస్తోంది.

* కాంగ్రెస్ తరపున రంగంలోకి దిగిన మంత్రులు..?

కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని కైవసం చేసుకుంటామని చెప్పిన రాష్ట్ర మంత్రులు కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో ఇతర పార్టీల కార్పొరేటర్లకు గాలం వేసేందుకు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీకి 22 కార్పొరేషన్ సీట్లు దక్కగా, మ్యాజిక్ ఫిగర్‌కు మరో 9 సీట్లు అవసరం కావడంతో సిపిఎం-1, ఇండిపెండెంట్లుగా గెలిచిన ఆరుగురి మద్దతు కోరడంతోపాటు ఇతర పార్టీల నుంచి గెలిచిన వారిని తమ పార్టీకి అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నట్లు జోరుగా వినవస్తోంది. ఈ మేరకు వారికి భారీగా ఆఫర్లు ఆశ చూపిస్తున్నట్లు రాజకీయవర్గాలు పేర్కొంటున్నాయి.

* ఇండిపెండెంట్ కార్పొరేటర్లను వరించిన అదృష్టం...?




కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలంటే అటు కాంగ్రెస్‌కు 9 మంది, ఇటు సిపిఐకి కనీసం ఒక కార్పొరేటర్ మద్దతు అవసరం ఉంది. అయితే మేయర్ ఎన్నిక సమయంలో ఎమ్మెల్యే, ఎంపీల ఓట్లు కూడా కీలకం కానుండగా, కొత్తగూడెం శాసన సభ్యులుగా ఉన్న కూనంనేని సాంబశివరావు సీపీఐ పార్టీ కాగా, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రఘునాధం రామసహాయం కాంగ్రెస్ పార్టీకి చెందినవారు కావడంతో మళ్లీ 'టై' అయ్యే అకవాశం ఉంది. దీంతో ఇండిపెండెంట్ లుగా గెలిచిన ఆరుగురు కార్పొరేటర్ల మద్దతు కీలకంగా మారనుంది. వీరిని తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన మంత్రులు బేరసారాలు ప్రారంభించారని, ఒక్కొక్కరికి సుమారు రూ.కోటి ఆఫర్ చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.

* క్యాంపు రాజకీయాలు ప్రారంభం...

మేయర్ ఎన్నిక జరిగేంతవరకు ఆయా పార్టీలు క్యాంపు రాజకీయాలకు తెరతీశాయి. ఇప్పటికే సిపిఐ, కాంగ్రెస్ పార్టీలు వారి కార్పొరేటర్లను క్యాంపునకు తరలించే సన్నాహాలు చేస్తున్నాయి. ఇక వీరితోపాటు తమకు అనుకూలంగా వ్యవహరించే వారిని కూడా ఈ క్యాంపులకు తరలించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారని తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం లేదా మరో ప్రాంతానికి కార్పొరేటర్లను తరలించి తిరిగి మేయర్ ఎన్నిక జరిగే ఈనెల 16వ తేదీన తీసుకువచ్చేందుకు వ్యూహరచన చేస్తున్నారు. ఏది ఏమైనా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పాలకవర్గం ఎన్నికపై ఇప్పుడు అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

# నాకు కొన్ని విషయాలు వినపడవు : బాలకృష్ణ ఫన్నీ కామెంట్స్

* అసెంబ్లీ లాబీలో బాలకృష్ణ, బొజ్జల, మంత్రి అనగాని మధ్య ఆసక్తికర చర్చ
* బొజ్జల బరువు తగ్గడంపై మంత్రి అనగానిని అడిగిన బాలయ్య
* ఇంకా తగ్గితే నాకు పోటీ వస్తావంటూ బొజ్జలకు సరదా హెచ్చరిక
* బాలయ్య, లోకేశ్ ను ఒకే ఫ్రేమ్‌లో చూడాలన్న బొజ్జల సుధీర్ రెడ్డి
* "నాకు కొన్ని వినపడవు" అంటూ బాలయ్య చమత్కారం



ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా నేతల మధ్య ఆసక్తికర సంభాషణలు, సరదా సన్నివేశాలు చోటు చేసుకుంటున్నాయి తాజాగా హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, మంత్రి అనగాని సత్యప్రసాద్ మధ్య బరువు తగ్గడంపై జరిగిన చర్చ నవ్వులు పూయించింది. అసెంబ్లీ లాబీలో మంత్రి అనగానితో మాట్లాడుతున్న బాలకృష్ణ, అటుగా వచ్చిన బొజ్జల సుధీర్ రెడ్డిని చూపిస్తూ.. "బొజ్జల సుధీర్ రెడ్డి బరువు తగ్గానంటున్నాడు, మీకేమైనా తేడా కనిపిస్తుందా?" అని సరదాగా ప్రశ్నించారు. దీనికి బొజ్జల స్పందిస్తూ, "అన్నాయ్, ఇప్పటికే 15 కిలోలకు పైగా తగ్గాను, ఇంకా తగ్గమంటావా?" అని నవ్వుతూ సమాధానమిచ్చారు. వెంటనే బాలకృష్ణ తనదైన శైలిలో.. "ఇంకా తగ్గకు, మళ్లీ నాకు పోటీ వస్తావ్" అంటూ ఛలోక్తి విసరడంతో అక్కడ నవ్వులు విరిశాయి. ఈ క్రమంలో బొజ్జల బదులిస్తూ.. "ప్రజలు మిమ్మల్ని, లోకేశ్ గారిని ఒకే ఫ్రేమ్‌లో చూడాలని అనుకుంటున్నారు" అని బాలకృష్ణతో అన్నారు. ఈ రాజకీయ ప్రస్తావనకు బాలకృష్ణ అంతే చమత్కారంగా.. "నాకు కొన్ని విషయాలు వినపడవు" అని బదులిచ్చి అక్కడి నుంచి ముందుకు సాగారు.


# వైసీపీ దిగజారుడు రాజకీయాలకు ప్రజలే సమాధానం చెబుతారు




రప్పా రప్పా రాజకీయాలకు ఎవరూ భయపడరు: కేశినేని శివనాథ్ చిన్ని గారు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య గారు.. శుక్రవారం నాడు విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) గారు మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గారు కూటమి నేతలతో కలిసి పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ నాయకుల వ్యవహార శైలి తీవ్రంగా విమర్శించారు. రాజకీయ నాయకులు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా హుందాగా వ్యవహరించి ప్రజా సమస్యలపై నిత్యం పోరాడాలని అన్నారు. కానీ వైసీపీ నేతలు మాత్రం దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతూ, రాయడానికి వీలులేని రోత మాటలతో ప్రజల చేత ఛీ కొట్టించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు గడ్డి పెట్టినా వారికి బుద్ధి రావడంలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారిని తీవ్ర పదజాలంతో దూషించిన కేసులో అరెస్టై రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్లి వచ్చినప్పటికీ అంబటి రాంబాబు కు సిగ్గు రాలేదని వ్యాఖ్యానించారు. కోర్టు రిమాండ్ విధించినప్పుడు బయటకు వస్తూ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చినట్లు చేతులు ఊపడం, మళ్లీ 'తగ్గేదేలే' అంటూ రెచ్చిపోవడం వైసీపీ రప్పా రప్పా రాజకీయాలకు నిదర్శనమని పేర్కొన్నారు. మహిళల గురించి నీచంగా మాట్లాడడమే కాకుండా తప్పు చేశాననే భావన కూడా లేకుండా ప్రవర్తించడం బాధాకరమని, అంబటి వ్యాఖ్యలను మహిళా లోకం తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. "అంబటి రాంబాబు అంతటి నీచుడు, నికృష్టుడు, దరిద్రుడు... ఇంతటి వ్యక్తిని నా జీవితంలో చూడలేదు. ప్రతిరోజూ దేవుడికి దండం పెట్టుకునేప్పుడు ఇలాంటి వ్యక్తిని మళ్లీ నా జీవితంలోకి తీసుకురాకూడదని ప్రార్థిస్తాను" అంటూ ఆయన అల్లుడు డాక్టర్ గౌతమ్ చేసిన వ్యాఖ్యలను కూడా వారు ప్రస్తావించారు. "యథా లీడర్ తథా క్యాడర్" అన్నట్టు కూటమి క్యాడర్‌ను రెచ్చగొట్టేలా మాట్లాడటం, ఉద్దేశపూర్వకంగా అసభ్య పదజాలంతో దూషించడం వైసీపీ నేతలకు అలవాటైందని విమర్శించారు. అంబటి రాంబాబు లాంటి వారు రాజకీయాలను భ్రష్టుపట్టిస్తున్నారని అన్నారు. రప్పా రప్పా రాజకీయాలకు ఎవరూ భయపడరని, ప్రజాస్వామ్యంలో హుందాతనమే ప్రధానమని, చిల్లర మాటలు మాట్లాడటం ద్వారా సమాజానికి చెడు సందేశం వెళ్తుందని వారు హెచ్చరించారు. చివరగా ప్రజలు అన్నింటిని గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు తగిన తీర్పు ఇస్తారని స్పష్టం చేశారు.

# 16 ఏళ్ల లోపు చిన్నారులకు సోషల్ మీడియా వాడకాన్ని నిషేధించాలి: మండలిలో నాగబాబు

* ప్రాణాంతక చాలెంజ్‌ల బారినపడి పిల్లలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన
* సోషల్ మీడియా నియంత్రణకు ప్రత్యేక చట్టాలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి
* విద్యార్థులకు ఇచ్చే ట్యాబ్‌లను కేవలం చదువుకే పరిమితం చేయాలని సూచన
* హోం, ఐటీ, విద్యాశాఖలు సమన్వయంతో పనిచేయాలని పిలుపు



16 ఏళ్ల లోపు వయసున్న చిన్నారులకు సోషల్ మీడియా వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని జనసేన ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు కోరారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ... చిన్నారులు సైబర్ నేరాలు, ప్రమాదకరమైన ఆన్‌లైన్ ట్రెండ్స్ బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. సోషల్ మీడియా కట్టడికి ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాలో మంచి, చెడులను విశ్లేషించుకునే విచక్షణ పెద్దలకు ఉంటుందని, కానీ 16 ఏళ్ల లోపు పిల్లలకు ఆ పరిపక్వత ఉండదని నాగబాబు అన్నారు. గతంలో 'బ్లూ వేల్ చాలెంజ్' వంటి ప్రమాదకరమైన క్రీడలకు ఆకర్షితులై ఎంతోమంది చిన్నారులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం 'మెమో చాలెంజ్', 'స్కల్ బ్రేకర్ చాలెంజ్', 'ఫైర్ చాలెంజ్' వంటి ప్రాణాంతకమైన సాహసాలు పిల్లలను ఆకర్షిస్తున్నాయని, వాటికి ఆకర్షితులై కొందరు ప్రాణాలు కోల్పోతుంటే, మరికొందరు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్లుగా సోషల్ మీడియాను కట్టడి చేసేందుకు కఠినమైన చట్టాలు రూపొందించాలని నాగబాబు ప్రభుత్వానికి సూచించారు. ఆస్ట్రేలియా, ఫ్రాన్స్, డెన్మార్క్ వంటి పలు ఐరోపా దేశాలు ఇప్పటికే 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధించాయని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఐటీ, పోలీస్, విద్యాశాఖలు సమన్వయంతో పనిచేసి సోషల్ మీడియా అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. హోం, ఐటీ, విద్యా శాఖలు సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడాన్ని ఆయన అభినందించారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌ల వంటి ఎలక్ట్రానిక్ పరికరాల్లో కేవలం విద్యకు సంబంధించిన సమాచారం మాత్రమే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ ట్యాబ్‌లలో సోషల్ మీడియా యాప్‌లను వాడకుండా పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. పాఠశాలల్లో జరిగే పేరెంట్స్ టీచర్స్ సమావేశాల్లో తల్లిదండ్రులకు ఈ విషయంపై అవగాహన కల్పించాలని, తద్వారా చిన్నారుల భవిష్యత్తును కాపాడవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

## జగన్ ఒక 'మర్చంట్ ఆఫ్ డెత్'...

# సోమిరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు

* వైసీపీ అధినేత జగన్‌ను 'మర్చంట్ ఆఫ్ డెత్' అంటూ అభివర్ణించిన సోమిరెడ్డి
* జగన్‌కు విధ్వంసం, శవ రాజకీయాలంటే ఇష్టమని తీవ్ర ఆరోపణ
* ర్యాలీల్లో చనిపోయిన కార్యకర్తలను కూడా పరామర్శించరని విమర్శ
* తల్లిదండ్రులను దూషించే వారిని శిక్షించేలా ప్రత్యేక చట్టం తేవాలని డిమాండ్



మాజీ మంత్రి, టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి.. వైసీపీ అధినేత జగన్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్‌ను 'మర్చంట్ ఆఫ్ డెత్' (మృత్యు వ్యాపారి) అని అభివర్ణించారు. జగన్‌కు విధ్వంసం, శవ రాజకీయాలు అంటే ఎంతో ఇష్టమని సోమిరెడ్డి విమర్శనాస్త్రాలు సంధించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ.. "డిక్కీలో శవాన్ని వేసుకుని వచ్చిన తన ఎమ్మెల్సీ భుజాన్ని తట్టే నైజం జగన్‌ది. తన ర్యాలీలోనే కార్యకర్తలు చనిపోతే కనీసం పరామర్శకు వెళ్లరు. కానీ, బూతులు తిట్టిన వారిని మాత్రం పరామర్శిస్తారు. ర్యాలీలు చేపట్టి ఒకరిద్దరు చనిపోయేలా చేస్తారు. అందుకే జగన్‌ను 'మర్చంట్ ఆఫ్ డెత్' అంటాను" అని తీవ్రంగా విమర్శించారు. కేవలం శవ రాజకీయాలు చేసేందుకే జగన్ తన పార్టీని స్థాపించారని ఆయన ఆరోపించారు. రాజకీయ ప్రత్యర్థుల తల్లిదండ్రులను దూషించిన వారిని జగన్ కనీసం కట్టడి చేయరని సోమిరెడ్డి మండిపడ్డారు. రాజకీయాల్లో ఇలాంటి సంస్కృతి మంచిది కాదన్నారు. నేతల తల్లిదండ్రులను దూషించే వారిని కఠినంగా శిక్షించేందుకు వీలుగా రాష్ట్రంలో ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఆ రాతలు మానుకోకపోతే అల్మారాల్లోని అస్థిపంజరాలు బయటకొస్తాయి

: 'సాక్షి'పై కుటుంబరావు ఫైర్

* హెరిటేజ్‌పై సాక్షి మీడియా ఆరోపణలు అవాస్తవమన్న కుటుంబరావు
* టీటీడీకి హెరిటేజ్ ఎప్పుడూ నెయ్యి సరఫరా చేయలేదని స్పష్టీకరణ
* భారతీ సిమెంట్ ధర పెంచినప్పుడు తప్పు కాదా అని ప్రశ్న
* క్విడ్ ప్రో కో, ప్రజాధనంతో సాక్షికి లబ్ధి చేకూర్చారని విమర్శ
* నీతిగా వ్యాపారం చేసే సంస్థపై బురద చల్లొద్దని హెచ్చరిక



హెరిటేజ్ ఫుడ్స్‌పై వైసీపీ, సాక్షి మీడియా చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, కల్పిత కథలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ పి. కుటుంబరావు తీవ్రంగా విమర్శించారు. ఒక పత్రికలో ప్రచురించిన కథనం కేవలం ఫిక్షన్ రైటింగ్ అని, అందులో వాస్తవాలు లేవని ఆయన కొట్టిపారేశారు. అబద్ధపు రాతలు మానుకోకపోతే సాక్షి యాజమాన్యం అల్మారాల్లోని అస్థిపంజరాలు బయటకు వస్తాయని, జైలు గడప తొక్కే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హెరిటేజ్ సంస్థ తన చరిత్రలో ఏ ప్రభుత్వానికి, దేవాలయానికి నెయ్యి సరఫరా చేయలేదని కుటుంబరావు స్పష్టం చేశారు. కేవలం తమ బ్రాండ్‌పై నేరుగా వినియోగదారులకు మాత్రమే అమ్ముతుందని తెలిపారు. హెరిటేజ్ వెబ్‌సైట్ నుంచి ఒక ఫోటోను ఎడిట్ చేసి, ఇందాపూర్ డైరీలో నెయ్యి తయారవుతున్నట్లు తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు. ఇందాపూర్ డైరీ అనేది హెరిటేజ్‌కు ఒక 'కోమాన్యుఫ్యాక్చరింగ్' యూనిట్ మాత్రమేనని, అక్కడ పాలు, పన్నీర్ వంటివి తయారవుతాయని, నెయ్యి ఉత్పత్తి జరగదని వివరించారు. బ్రిటానియా, హిందుస్థాన్ యూనిలివర్ వంటి దిగ్గజ సంస్థలకు ఉత్పత్తులు సరఫరా చేసే సోనాయ్ (ఇందాపూర్) డైరీపై సిండికేట్ ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు. ద్రవ్యోల్బణం కారణంగా దేశవ్యాప్తంగా నెయ్యి ధరలు పెరిగాయని, ఈ వాస్తవాన్ని దాచిపెట్టి రాజకీయ కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్ల క్రితం ధరలతో ఇప్పటి ధరలను పోల్చి దోపిడీగా చిత్రీకరించడం అజ్ఞానమని అన్నారు. "2014లో బస్తా రూ.250 ఉన్న భారతీ సిమెంట్ ధరను జగన్ రెడ్డి ఇప్పుడు రూ.430కి అమ్ముతున్నారు. అది తప్పు కానప్పుడు, డైరీ ఉత్పత్తుల ధరలు పెరగడం ఎలా తప్పవుతుంది?" అని ఆయన ప్రశ్నించారు. టీటీడీకి నెయ్యి సరఫరా చేయని హెరిటేజ్, సిండికేట్ ఎందుకు అవుతుందని నిలదీశారు. గత ఐదేళ్లలో రూ.600 కోట్ల ప్రభుత్వ ప్రకటనలతో నష్టాల్లో ఉన్న సాక్షిని ఎలా పోషించారో బ్యాలెన్స్ షీట్లు చూస్తే తెలుస్తుందన్నారు. "దేశంలో సాక్షి కంటే ఐదు రెట్లు పెద్ద పత్రికల మార్కెట్ విలువ రూ.1500 కోట్లు ఉంటే, 2008లోనే సాక్షికి రూ.3500 కోట్ల వాల్యుయేషన్ ఎలా వచ్చింది? ఇది క్విడ్ ప్రో కో, మనీ లాండరింగ్ కాదా?" అని కుటుంబరావు తీవ్ర ఆరోపణలు చేశారు. వైసీపీ నేత బొల్లా బ్రహ్మనాయుడి 'వల్లభ' నెయ్యి కూడా మార్కెట్‌లో అధిక ధరకే అమ్ముతున్నారని, దీనిపై సాక్షి ఎందుకు రాయదని ప్రశ్నించారు. హెరిటేజ్ సంస్థ రైతులకు బాకీలు లేకుండా, ప్రభుత్వానికి పన్నులు సక్రమంగా చెల్లిస్తూ నీతిగా వ్యాపారం చేస్తోందని, ఇటీవలే భువనేశ్వరి గారికి ప్రతిష్ఠాత్మక 'గోల్డెన్ పీకాక్' అవార్డు వచ్చిందని గుర్తుచేశారు.

# పేర్ని నానికి నోటీసులు ఇవ్వండి: ఏపీ హైకోర్టు

* చంద్రబాబు, పవన్ లను దూషించిన కేసు
* పేర్ని నాని క్వాష్ పిటిషన్ ను కొట్టివేసిన హైకోర్టు
* నోటీసులు ఇచ్చి విచారించాలని హైకోర్టు ఆదేశం




ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లను దూషించిన అంశానికి సంబంధించి మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నానిపై మచిలీపట్నం ఇనగుదురుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ ఏపీ హైకోర్టులో పేర్ని నాని క్వాష్ పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ ను నిన్న విచారించిన హైకోర్టు పేర్ని నానికి నోటీసులు ఇవ్వాలని ఆదేశించింది. పేర్ని నానిపై నమోదైన కేసులు ఏడేళ్లలోపు శిక్షకు సంబంధించినవేనని... క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 35(3) ప్రకారం ఆయనకు నోటీసులు ఇచ్చి, విచారణ కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసింది. పేర్ని నాని క్వాష్ పిటిషన్ ను కొట్టివేసింది. తదుపరి విచారణను మార్చి 12వ తేదీకి వాయిదా వేసింది.

# 6 మున్సిపాలిటీల్లో బీజేపీ సింగిల్ లార్జెస్ట్ పార్టీ... కరీంనగర్, నిజామాబాద్ గెలుస్తున్నాం

: రామచందర్ రావు


* **ఈ ఎన్నికల్లో బీజేపీ బలపడిందన్న రామచందర్ రావు**
* **హంగ్ వచ్చినా బీజేపీ ఎవరికీ మద్దతివ్వదని స్పష్టీకరణ**
* **తెలంగాణలో కచ్చితంగా అధికారంలోకి వస్తామని ధీమా**



ఆరు మున్సిపాలిటీల్లో బీజేపీ సింగిల్ లార్జెస్ట్ పార్టీగా అవతరించిందని, రెండు కార్పొరేషన్లు గెలుచుకోబోతున్నామని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో బీజేపీ బలపడిందని అన్నారు. ఎక్కువ సీట్లు, ఓట్లు సాధించామని ఆయన వ్యాఖ్యానించారు. ఇప్పటి వరకు వెలువడిన ఫలితాల్లో 250 వార్డుల్లో గెలిచామని పేర్కొన్నారు. కరీంనగర్, నిజామాబాద్ మున్సిపాలిటీలను కైవసం చేసుకోబోతున్నామని వ్యాఖ్యానించారు. నారాయణపేట, ఆదిలాబాద్, రాయికల్ వంటి మున్సిపాలిటీల్లో బీజేపీ వారే ఛైర్మన్లు అవుతారని ధీమా వ్యక్తం చేశారు. ఎక్స్ అఫిషియో, స్వతంత్ర అభ్యర్థుల మద్దతుతో ఛైర్మన్ పదవులు దక్కించుకుంటామని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తాము ఆశించిన మేర ఉన్నాయని, కొన్ని జిల్లాల్లో మాత్రం ఆశించిన ఫలితాలు రాలేదని అన్నారు. త్రిముఖ పోరులో బీజేపీకి కొంత నష్టం జరిగిందని రామచందర్ రావు అన్నారు. అనేక చోట్ల హంగ్ వచ్చిందని తెలిపారు. ఇవి కాంగ్రెస్ పార్టీకి సానుకూల ఫలితాలు కావని అభిప్రాయపడ్డారు. బీజేపీని ఓడించడానికి పలు చోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్, మజ్లిస్ పార్టీలు కలిసి పనిచేశాయని ఆరోపించారు. అందుకే బీఆర్ఎస్ అన్ని సీట్లు గెలుచుకోగలిగిందని అన్నారు. హంగ్ వచ్చినా బీజేపీ ఎవరికీ మద్దతు ఇవ్వదని స్పష్టం చేశారు. హైదరాబాద్ ప్రజలు ఆ మూడు పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. పట్టణ ప్రాంతాల్లో బీజేపీ బలంగా ఉందని రామచందర్ రావు స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు బీజేపీని విశ్వసిస్తున్నారని, తాము కచ్చితంగా అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. తాము ఎవరికీ మద్దతు ఇచ్చేది లేదని, తమకు మద్దతు ఇస్తామంటే తీసుకుంటామని స్పష్టం చేశారు.

## కేసీఆర్‌ను కూడా ప్రజలు ఓడించారు: రేవంత్ రెడ్డి 'నేనే రాజు' వ్యాఖ్యలపై కేటీఆర్ కౌంటర్

* **నేనే రాజు నేనే మంత్రి అన్న రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందన**
* **అలా అనుకున్న వారు ఎందరో గాలికి కొట్టుకుపోయారన్న కేటీఆర్**
* **తెలంగాణ సాధించిన కేసీఆర్‌ను కూడా కామారెడ్డిలో ప్రజలు ఓడించారన్న కేటీఆర్**



తెలంగాణకు 'నేనే రాజు నేనే మంత్రి' అన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, 'నేనే రాజు నేనే మంత్రి' అనుకునే పిచ్చి తుగ్లక్‌లు చాలామంది ఉంటారని, చరిత్రలో కూడా ఒక తుగ్లక్ ఉండేవాడని ఎద్దేవా చేశారు. అలా అనుకున్నవారు ఎందరో గాలికి కొట్టుకుపోయారని అన్నారు. ప్రజల చైతన్యాన్ని ఎవరూ తక్కువ అంచనా వేయవద్దని అన్నారు. ఈ దేశంలో ఇందిరాగాంధీ, ఎన్టీఆర్ వంటి నాయకులు సైతం ఓడిపోయారని గుర్తు చేశారు. తెలంగాణ సాధించిన కేసీఆర్ వంటి నాయకుడిని కూడా కామారెడ్డిలో దురదృష్టవశాత్తూ ప్రజలు ఓడించారని అన్నారు. అక్కడ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడో స్థానానికి వచ్చారని గుర్తు చేశారు. ఇలా నేనే రాజు నేనే మంత్రి అని రేవంత్ రెడ్డిలా విర్రవీగిన వాళ్లు వచ్చారు, పోయారని... కానీ దేశం, ప్రజల చైతన్యం అలాగే ఉందన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో తాము పూర్తి స్పష్టతతో ఉన్నామని కేటీఆర్ అన్నారు. తన ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అంత విశ్వాసం ఉంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి తిరిగి ఉప ఎన్నికలకు రావాలని సవాల్ చేశారు. పదిచోట్ల ఉప ఎన్నికలు వస్తే అప్పుడు ప్రజలు తేల్చుతారని అన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభంజనం..
## అనేకచోట్ల హంగ్.. క్యాంపు రాజకీయాలకు తెర!

* **తెలంగాణ పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ హవా**
* **మొత్తం 116 మున్సిపాలిటీల్లో 62 చోట్ల హస్తం పార్టీకి స్పష్టమైన మెజారిటీ**
* **పలుచోట్ల హంగ్ ఫలితాలు రావడంతో క్యాంపు రాజకీయాలకు తెరలేపిన పార్టీలు**
* **కార్పొరేషన్లలోనూ కాంగ్రెస్ హవా.. కీలక స్థానాల్లో పట్టు నిలుపుకున్న బీజేపీ**
* **ఛైర్మన్లు, మేయర్ల ఎన్నిక కోసం సోమవారం ప్రత్యేక సమావేశాలు**



తెలంగాణలో జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. శుక్రవారం జరిగిన ఓట్ల లెక్కింపులో స్పష్టమైన ఆధిక్యం కనబరుస్తూ, రాష్ట్రంలోని పట్టణ ఓటర్లు తమకే పట్టం కట్టారని నిరూపించుకుంది. మొత్తం 116 మున్సిపాలిటీలకు గాను, కాంగ్రెస్ పార్టీ ఏకంగా 62 చోట్ల విజయం సాధించి జెండా ఎగరేసింది. మరోవైపు, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ కేవలం 12 మున్సిపాలిటీలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ ఒక మున్సిపాలిటీని కైవసం చేసుకుంది. మరో నాలుగు మున్సిపాలిటీల ఫలితాలు వెలువడాల్సి ఉంది. ఈ ఎన్నికల్లో అత్యంత ఆసక్తికరమైన అంశం హంగ్ ఫలితాలు. సుమారు 37 మున్సిపాలిటీల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాకపోవడంతో, ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవుల కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. దీంతో ఇండిపెండెంట్లు, ఇతర పార్టీల సభ్యులను తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు క్యాంపు రాజకీయాలకు తెరలేపాయి. ఇది రాబోయే రోజుల్లో రాజకీయ వేడిని మరింత పెంచనుంది. మున్సిపాలిటీలతో పాటు ఏడు కార్పొరేషన్లలోనూ కాంగ్రెస్ పార్టీ తన హవాను కొనసాగించింది. మంచిర్యాల, రామగుండం, నల్గొండ కార్పొరేషన్లలో స్పష్టమైన మెజారిటీ సాధించగా, మహబూబ్‌నగర్‌లో ఆధిక్యంలో కొనసాగుతోంది. కొత్తగూడెం కార్పొరేషన్‌లో కాంగ్రెస్, సీపీఐ చెరో 22 స్థానాలు గెలుచుకుని సమ ఉజ్జీలుగా నిలిచాయి. మరోవైపు, బీజేపీ తమకు బలమైన పట్టున్న నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లలో ఆధిక్యం ప్రదర్శించింది. ఈ రెండు ప్రాంతాలు బీజేపీ సిట్టింగ్ లోక్‌సభ స్థానాలు కావడం గమనార్హం. వార్డుల వారీగా చూస్తే, మొత్తం 2,582 మున్సిపల్ వార్డులకు గాను, శుక్రవారం సాయంత్రం 4:30 గంటల వరకు 2,543 స్థానాల ఫలితాలు వెలువడ్డాయి. వీటిలో కాంగ్రెస్ 1,325 వార్డులు గెలుచుకోగా, బీఆర్ఎస్ 707, బీజేపీ 260 వార్డుల్లో విజయం సాధించాయి. ఎంఐఎం, ఇండిపెండెంట్లు కలిపి 251 స్థానాలను దక్కించుకున్నారు. కార్పొరేషన్ల పరిధిలోని 414 డివిజన్లకు గాను వెలువడిన 291 ఫలితాల్లో, కాంగ్రెస్ 154, బీఆర్ఎస్ 49, బీజేపీ 34, ఇతరులు 54 స్థానాలు కైవసం చేసుకున్నారు. బుధవారం జరిగిన పోలింగ్‌లో 73 శాతానికి పైగా ఓటింగ్ నమోదైంది. మున్సిపాలిటీల్లో 75.88 శాతం, కార్పొరేషన్లలో 66.05 శాతం పోలింగ్ జరిగింది. కాగా, మున్సిపల్ ఛైర్మన్లు, మేయర్ల ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్‌ను శనివారం జారీ చేయనున్నారు. కొత్తగా ఎన్నికైన కౌన్సిలర్లు, కార్పొరేటర్లు ఫిబ్రవరి 16న (సోమవారం) ప్రమాణ స్వీకారం చేసి, అదే రోజు ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, మేయర్లు, డిప్యూటీ మేయర్లను ఎన్నుకోనున్నారు.

## మా గెలుపుతో..
## కల్వకుంట్ల కవితకు సంబంధం లేదు

: వడ్డేపల్లి శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు

* **వడ్డేపల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకున్న ఫార్వర్డ్ బ్లాక్**
* **ఫార్వర్డ్ బ్లాక్ తరపున పోటీ చేసిన కవిత మద్దతుదారులు**
* **కవిత తమ తరపున ప్రచారం చేయలేదన్న శ్రీనివాస్**



తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత మద్దతు పలికిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి చెందిన అభ్యర్థులు విజయకేతనం ఎగురవేశారు. మొత్తం 10 వార్డులకు గాను 8 వార్డుల్లో సింహం గుర్తుపై గెలిచి సంచలనం సృష్టించారు. ఈ గెలుపు చర్చనీయాంశంగా మారుతున్న వేళ, కవిత విజయం గురించి చర్చ ప్రారంభమైన వేళ... ఆమెకు షాక్ తగిలింది. తమ విజయంతో కవితకు ఎలాంటి సంబంధం లేదని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తరపున గెలిచిన వడ్డేపల్లి శ్రీనివాస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం ఓ న్యూస్ చానల్ తో వడ్డేపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... తమ విజయంతో జాగృతికి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి బీఫారం తీసుకోవడానికి వెళ్లినప్పుడు కవిత తమకు జాగృతి కండువా కప్పారని... కానీ, ఆమె తమ తరపున ప్రచారానికి వచ్చిందే లేదని చెప్పారు. ప్రచారంలో తాము కవిత కండువా వేసుకున్నది కూడా లేదని, ఆ రోజు తర్వాత కవితతో తాము మాట్లాడింది కూడా లేదని తెలిపారు. ఈ గెలుపు తమ సొంతమని చెప్పారు. శ్రీనివాస్ వ్యాఖ్యలపై కవిత ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

## మా రెండేళ్ల పాలనకు ఈ ఫలితాలే నిదర్శనం

: సీఎం రేవంత్ రెడ్డి

* **తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం**
* **ఇది తమ రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన ఆమోదమని సీఎం రేవంత్ వ్యాఖ్య**
* **పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి దక్కిన తీర్పుగా అభివర్ణన**
* **ప్రతి కార్యకర్తకు ఈ విజయాన్ని అంకితం ఇస్తున్నట్లు ప్రకటన**
* **ప్రతి మున్సిపాలిటీని అభివృద్ధి చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని హామీ**



తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల ఫలితాలు తమ రెండేళ్ల పాలనకు ప్రజలు ఇచ్చిన బలమైన తీర్పు అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని అందించిన ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. తమ ప్రజా ప్రభుత్వ పాలనకు, పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమానికి, ప్రపంచస్థాయి ప్రణాళికలతో అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఈ తీర్పు ద్వారా ప్రజలు సంపూర్ణ ఆమోదం తెలిపారని ఆయన శుక్రవారం పేర్కొన్నారు. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. వెలువడిన ఫలితాల ప్రకారం, 116 మున్సిపాలిటీలకు గాను 66 చోట్ల కాంగ్రెస్ జెండా ఎగురవేసింది. అలాగే 7 కార్పొరేషన్లలో 3 చోట్ల స్పష్టమైన మెజారిటీ సాధించగా, మరో కార్పొరేషన్‌లో ఆధిక్యంలో కొనసాగుతోంది. ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాని మరో 37 మున్సిపాలిటీలలో కూడా పీఠాలను కైవసం చేసుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఈ చారిత్రక విజయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఎక్స్' వేదికగా స్పందించారు. "లక్షలాది మంది కాంగ్రెస్ కార్యకర్తల అవిశ్రాంత శ్రమకు దక్కిన ఫలితమే ఈ విజయం. పార్టీ పట్ల వారికి ఉన్న అపారమైన అభిమానానికి ఇది నిలువుటద్దం. పార్టీ జెండాను మోసి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లిన ప్రతి కార్యకర్తకు ఈ విజయాన్ని అంకితం చేస్తున్నాను" అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. ఈ గెలుపు తమ బాధ్యతను మరింత పెంచిందని సీఎం అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి, పారదర్శక పాలనకు తాము పునరంకితం అవుతున్నామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఎన్నికల్లో ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రతి మున్సిపాలిటీని, ప్రతి కార్పొరేషన్‌ను అభివృద్ధి పథంలో నడిపించి చూపిస్తామని ఆయన భరోసా ఇచ్చారు. ఈ ఫలితాలు ప్రభుత్వ పనితీరుకు ప్రజలు ఇచ్చిన సానుకూల తీర్పుగా రాజకీయ విశ్లేషకులు అభివర్ణిస్తున్నారు.

## పుర ఫలితాలు..
## గాంధీ భవన్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు



హైదరాబాద్: తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ ఘన విజయం దిశగా దూసుకెళ్తుండటంతో ఆ పార్టీ కార్యకర్తలు, నేతలు ఉత్సాహంతో సంబరాలు చేసుకుంటున్నారు. హైదరాబాద్ గాంధీభవన్.. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలతో కిక్కిరిసి పోయింది. బాణసంచా కాల్చి, ఒకరికొకరు మిఠాయిలు పంచుకుంటూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, రాహుల్ గాంధీకి మద్దతుగా నినాదాలతో గాంధీ భవన్ మార్మోగింది. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంపై పార్టీ శ్రేణులు ప్రశంసలు కురిపించారు. సీఎం, టీపీసీసీ అధ్యక్షుడి కృషి ఫలితంగానే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పార్టీ శ్రేణులు పేర్కొన్నాయి. జాతీయ నాయకత్వం అందించిన మార్గదర్శకత్వం వల్లే రాష్ట్రంలో కాంగ్రెస్ బలపడిందని నినాదాలు చేశారు. తెలంగాణ ప్రజలు అభివృద్ధి, సంక్షేమానికి పట్టం కట్టారని నేతలు వ్యాఖ్యానించారు. మున్సిపల్ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ సాధించిన ఈ విజయాలు భవిష్యత్ ఎన్నికలకు బలమైన పునాది వేశాయన్నారు. పార్టీ సీనియర్ నాయకులు వి.హనుమంతరావు, మెట్టు సాయికుమార్, రోహిన్ రెడ్డిలతోపాటు పలువురు కాంగ్రెస్ నాయకులు ఈ సంబరాల్లో పాల్గొన్నారు.

## కేంద్రం నిధులతో కరీంనగర్‌ను అభివృద్ధి చేస్తాం: బండి సంజయ్



కరీంనగర్: అత్యధిక స్థానాల్లో గెలిపించి.. కరీంనగర్ ప్రజలు భాజపాపై గురుతర బాధ్యత పెట్టారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో భాజపా అభ్యర్థులు అత్యధిక స్థానాలు కైవసం చేసుకున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. భాజపా విజయం కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కరీంనగర్ ప్రజలు తమపై ఉంచిన బాధ్యతను స్వీకరిస్తున్నట్టు చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో కేంద్రం నుంచి నిధులు తెచ్చి కరీంనగర్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. ''కరీంనగర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం లోపాయికారీ ఒప్పందం చేసుకున్నాయి. ఓటుకు రూ.7వేల నుంచి రూ.10వేల వరకు పంపిణీ చేశారు. కాంగ్రెస్, ఎంఐఎం మతం పేరుతో అల్లర్లు సృష్టించాలని చూశాయి. భాజపా అభ్యర్థులను ప్రలోభాలకు గురి చేసేందుకు రూ.50లక్షల నుంచి రూ.కోటి వరకు ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. జీహెచ్ఎంసీని ఒవైసీ కుటుంబం, రేవంత్‌రెడ్డి అన్నదమ్ముల ఆస్తుల మాదిరిగా పంచుకున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని మూడు కార్పొరేషన్లను కూడా భాజపా కైవసం చేసుకుంటుంది'' అని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు.

## భారీ మెజారిటీ రావడం ఇదే మొదటిసారి


**: భట్టి, పొంగులేటి**





హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించిన పట్టణ ప్రాంత ఓటర్లకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రజలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను విశ్వసించారన్నందుకు ఈ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతిపక్ష పార్టీలు గాలి కబుర్లు, కట్టు కథలు, ఉన్నది లేనట్టు లేనిది ఉనట్టు ప్రచారం చేశాయని విమర్శించారు. అన్ని అంశాలు గమనించిన ప్రజలు.. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించారని వివరించారు. ఈ గెలుపుతో తమ ప్రభుత్వంపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. 116 మున్సిపాలిటీల్లో 83 చోట్ల స్పష్టమైన ఆధిక్యంతో కాంగ్రెస్ పార్టీ ముందుందన్నారు. స్వతంత్ర అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నట్లు వెల్లడించారు. సంపూర్ణ సమాచారంతో 90 నుంచి 94 స్థానాలు గెలువబోతున్నామని, గత రెండు..మూడు దశాబ్దాల్లో ఇంత భారీ మెజారిటీ రావడం ఇదే మొదటిసారి అని ఆనందం వ్యక్తం చేశారు. ఐదు నగర పాలక సంస్థల్లో తాము గెలిచామన్న భట్టి, పొంగులేటి.. రెండు కార్పొరేషన్లలో హంగ్ ఏర్పడినట్లు వెల్లడించారు. ఇప్పటికైనా ప్రతి పక్షాలు తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.

## మున్సిపల్ ఫలితాల వేళ షాకింగ్.. బీఆర్ఎస్ కార్పొరేటర్ కిడ్నాప్?




మున్సిపల్ ఎన్నికల ఫలితాల వేళ రాష్ట్రంలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. కొత్తగూడెం కార్పొరేషన్ లో 32వ డివిజన్ బీఆర్ఎస్ కార్పొరేటర్ రాంబాబును కాంగ్రెస్ నేతలు కిడ్నాప్ చేశారని.. అతని భార్య నాగమణి ఆరోపిస్తోంది. తన భర్తను తక్షణమే వదిలి పెట్టాలని వేడుకుంటోంది. ఇదిలా ఉంటే.. మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో సంచలనం చోటు చేసుకుంది. ఎవరూ ఊహించని విధంగా కొత్తగూడెం కార్పొరేషన్‌లో సీపీఐ పార్టీ ఘన విజయం సాధించింది. కొత్తగూడెం కార్పొరేషన్‌లోని అత్యధిక వార్డుల్లో విజయం సాధించిన ఎర్రదళం.. మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు రెడీ అయింది. అయితే మెజార్టీకి అవసరమైన స్థానాలు రాకపోవడంతో.. సీపీఐకి ఇతర పార్టీల మద్దతు అవసరం కానుంది. ఇప్పటికే మద్దతు ఇస్తామని బీఆర్ఎస్ ఓపెన్ ఆఫర్ ప్రకటించింది. దీనిపై సీపీఐ నేతలు ఏ నిర్ణయం తీసుకుంటారో అని ఆసక్తి నెలకొంది.

## టెట్ కనీస ఉత్తీర్ణత మార్కులను తగ్గించాలి : ఎస్టీయూ టీయస్ డిమాండ్

టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పరీక్షలో కనీస ఉత్తీర్ణత మార్కులు అధికంగా ఉండటం వల్ల ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు పాస్ అవ్వడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎస్టీయూ టీయస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. సదానందం గౌడ్, జుట్టు గజేందర్ ఆవేదన చెందారు. ఈ మేరకు శుక్రవారం సచివాలయంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావులకు వినతి పత్రాలు అందజేశారు. పాఠశాలల్లో సుదీర్ఘ కాలంగా, సమర్థవంతంగా బోధన చేస్తున్న ఇన్ సర్వీస్ ఉపాధ్యాయ సేవా అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొని, ఉత్తీర్ణత మార్కులు తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. బీహార్ రాష్ట్రంలో టెట్ ఉత్తీర్ణత మార్కులను గణనీయంగా తగ్గించారని, జనరల్, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు వరుసగా 50, 45.5, 40 శాతంగా ఉన్నాయని గుర్తు చేశారు.

# నెహ్రూ 'పంచశీల ఒప్పందం' అందుకే చేసుకుని ఉంటారు: సీడీఎస్

స్వాతంత్ర్యం తర్వాత భారత్‌చైనా సంబంధాల గురించి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం కోసమే అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1954లో పంచశీల ఒప్పందం చేసుకొని ఉంటారన్నారు. దేహ్రాదూన్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొన్న సీడీఎస్.. భారత్‌చైనా చారిత్రక సంబంధాలపై ప్రసంగించారు. ఆ ఒప్పందంలో భాగంగానే టిబెట్‌ను చైనాలో భాగమని భారత్ గుర్తించిందన్నారు. ''బ్రిటిషర్లు వెళ్లిపోయిన తర్వాత.. సరిహద్దు ప్రాంతాలను నిర్ణయించుకునే అవకాశం భారత్‌కు వచ్చింది. తూర్పున మెక్‌మోహన్ రేఖ, లద్దాఖ్‌లోని ప్రాంతాల గురించి నెహ్రూకు అవగాహన ఉండి ఉండొచ్చు. కానీ, ఈ ప్రదేశంపై (టిబెట్ సరిహద్దు ప్రాంతం) కాదు. అందుకే ఆయన చైనాతో పంచశీల ఒప్పందంపై ముందుకెళ్లారని భావిస్తున్నా. ఇదే చైనీయుల విషయానికొస్తే.. టిబెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని వారు సరిహద్దుల నుంచి లాసా (టిబెట్‌లోని నగరం), షిన్‌జియాంగ్‌లకు



వెళ్లిపోయారు. ఈ ప్రత్యేక ప్రాంతం రెండు దేశాలకు ఎంతో ముఖ్యమైనదిగా మారింది. అందుకే చైనీయులు ఇక్కడ స్థిరత్వాన్ని కోరుకున్నారు. ఆ సమయంలో భారత్ కూడా చైనాతో మంచి సంబంధాలు కొనసాగించాలని భావించింది. ఈ క్రమంలోనే 1954లో టిబెట్‌ను చైనాలో భాగంగా గుర్తించింది. పంచశీల ఒప్పందంపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి'' అని సీడీఎస్ చౌహాన్ వివరించారు. పొరుగు దేశాలు ఒకరి అంతర్గత వ్యవహారాల్లో మరొకరు జోక్యం చేసుకోకూడదని, శాంతియుతంగా ముందుకు సాగాలనే ఉద్దేశంతో భారత్‌చైనాల మధ్య 1954లో పంచశీల ఒప్పందం (ఐదు సూత్రాలు) జరిగింది. నాటి భారత ప్రధాని నెహ్రూ, చైనా ప్రధాని చౌ ఎన్‌లైలు సంతకాలు చేశారు. అయితే, చైనా వైఖరి చూస్తుంటే ఈ ఒప్పందం కేవలం వాణిజ్యం కోసమేనని అర్థమవుతోందని.. సరిహద్దు అంశంలో ఇది ఏమాత్రం ప్రతిబింబించలేదని సీడీఎస్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికీ.. వాస్తవాధీన రేఖ సున్నిత ప్రాంతంగా ఉన్న విషయాన్ని గుర్తుచేశారు.

## ఎన్నికలకు ముందు.. మహిళల ఖాతాల్లో రూ.5వేలు

తమిళనాడు శాసనసభకు ఏప్రిల్ నెలలో ఎన్నికలు జరగనున్నట్లు ప్రచారం జరుగుతోన్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మహిళలకు గుడ్ న్యూస్ చెప్పారు. కలైంగర్ పథకం కింద ఒక్కొక్కరికి రూ.5,000 చొప్పున రాష్ట్రంలోని 1.3 కోట్ల మంది మహిళల ఖాతాల్లో డబ్బు జమ చేసినట్లు ప్రకటించారు. ఈ మొత్తంలో రూ.2,000 సమ్మర్ స్పెషల్ అని పేర్కొన్నారు. ప్రతినెలా మహిళలకు అందించే రూ.1000 ఆర్థిక సహాయాన్ని ముందుగానే అందించినట్లు తెలిపారు. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలలో స్త్రీలకు ఇవ్వాల్సిన రూ.3 వేలకు మరో రూ.2000 కలిపి మొత్తం రూ.5వేలు మహిళల ఖతాలలో జమ చేసినట్లు స్టాలిన్ తెలిపారు. మహిళలకు ఆర్థిక మద్దతు, సంక్షేమం, సాధికారత, స్వయంఉపాధి కల్పించడం ఈ పథకం ఉద్దేశమన్నారు. ఎన్నికల పేరుతో కొందరు ఈ పథకాన్ని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా



తాను మాత్రం ఈ విషయంలో వెనక్కి తగ్గనని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి కొనసాగాలంటే త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి మద్దతివ్వాలని మహిళలను అభ్యర్థించారు

## రోడ్డు ప్రమాద బాధితులకు 'పీఎం-రాహత్'.. రూ.1.5 లక్షల నగదు రహిత చికిత్స

ప్రధానమంత్రి కార్యాలయం కొత్త భవనం సేవాతీర్థ్‌ను ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు పథకాలకు ఆయన ఆమోదం తెలిపారు. అందులో 'పీఎంరాహత్' ఒకటి. రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించే లక్ష్యంతో దీనిని తీసుకువచ్చారు. రూ.1.5 లక్షల మేర నగదు రహిత చికిత్స అందనుంది. నిధుల కొరత కారణంగా ప్రాణాలు కోల్పోకుండా దీని ద్వారా కాపాడుకోవచ్చు. రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో ఉచిత వైద్యం అందించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో దీనిని లాంచ్ చేశారు. రోడ్డు ప్రమాద బాధితుడిని ఆసుపత్రికి తీసుకువచ్చిన వెంటనే వైద్య సేవలు ప్రారంభించాల్సి ఉంటుంది. ఒకవేళ తమవద్ద సౌకర్యాలు లేకపోతే వెంటనే మరో ఆసుపత్రికి పంపాల్సి ఉంటుంది. అందుకోసం సదరు ఆసుపత్రి వారే రవాణా సౌకర్యాలు కల్పించాలి. బాధితుడు డిశ్చార్జ్ అయిన తర్వాత వైద్య సేవలు అందించిన ఆసుపత్రి అందుకు సంబంధించిన బిల్లును ప్యాకేజీకి అనుగుణంగా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ప్రమాదం జరిగిన నాటి నుంచి ఏడు రోజుల వరకు ఈ సేవలు పొందొచ్చని గతంలో కేంద్రప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. మరోవైపు లక్‌పతీదీదీల



సంఖ్యను మార్చి 2029 నాటికి రెట్టింపు చేసేలా కేంద్రం లక్ష్యం విధించుకుంది. ఇప్పటివరకు 3 కోట్లుగా ఉన్న టార్గెట్‌ను ఆరు కోట్లకు పెంచారు. వ్యవసాయ మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు నిధులను రూ.2 లక్షల కోట్లకు పెంచారు. దేశ స్టార్టప్ వ్యవస్థను వేగవంతం చేసేందుకు రూ.10 వేల కోట్ల నిధులు కేటాయిస్తూ

## విజయ్ ర్యాలీలో.. గుండెపోటుతో వ్యక్తి మృతి


సినీ నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ ప్రచార సభలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. తమిళనాడులోని సేలంలో జరిగిన ఎన్నికల ర్యాలీకి పెద్ద ఎత్తున అభిమానులు, కార్యకర్తలు హాజరయ్యారు. విజయ్ మాట్లాడుతుండగా.. ఓ వ్యక్తి స్పృహ కోల్పోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడు గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడిని మహారాష్ట్రకు చెందిన సూరజ్ (37) గా గుర్తించారు. ఉపాధి నిమిత్తం అతడు కొన్నేళ్ల క్రితం కుటుంబంతో



సహా సేలానికి వచ్చాడు. కొంత కాలంగా అతడు గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. మరోవైపు కరూర్ తొక్కిసలాట వంటి పరిస్థితులు తలెత్తకుండా విజయ్ ర్యాలీల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. సేలంలో అనుమతి తీసుకున్న దానికంటే ఎక్కువమందిని నిర్వాహకులు అనుమతించడం వల్ల వేదిక ప్రాంగణం కిక్కిరిసిపోయిందని తెలిపారు. 5 వేల మందికి మాత్రమే పరిమితి ఉంటే.. దాదాపు 7వేల మందిని తరలించారని చెప్పారు. ఆ వ్యక్తి మృతికి గల కారణం తెలిసిన వెంటనే ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామన్నారు. కాగా గతేడాది సెప్టెంబర్‌లో కరూర్‌లో నిర్వహించిన విజయ్ ర్యాలీలో తొక్కిసలాట జరిగి.. 41 మంది ప్రాణాలు కోల్పోయిన

## నరవణె పుస్తకం లీక్.. పెంగ్విన్ ఇండియా సిబ్బందిని ప్రశ్నించిన దిల్లీ పోలీసులు

భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ ఎం.ఎం. నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంపై వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో ప్రచురణకు ముందే పుస్తకం లీక్ అవడంపై పబ్లిషర్ పెంగ్విన్ ఇండియా సిబ్బందిని దిల్లీ స్పెషల్ సెల్ అధికారులు విచారించినట్లు తెలుస్తోంది. రెండు రోజులపాటు ఈ ఇంటరాగేషన్ జరిగిందని అధికార వర్గాలు తెలిపినట్లు మీడియాలో కథనాలు వస్తున్నాయి. వాటి ప్రకారం.. ఆ పుస్తకం, దాని డిజిటల్ ఫైళ్లను ఎలా భద్రపరిచారనే దానిపై సంస్థ నుంచి దర్యాప్తు అధికారులు పూర్తి వివరాలు అడిగినట్లు తెలుస్తోంది. పుస్తకం విడుదలకు ముందే దానికి సంబంధించి బయటకు వచ్చిన పీడీఎఫ్ వెర్షన్ గురించి ప్రశ్నించారు. విచారణ సమయంలో అందుబాటులో ఉన్న పీడీఎఫ్ ఫైళ్లను పరిశీలించగా.. ప్రింట్ చేసిన వారి




పేరు ఖాళీగా ఉండటాన్ని కనుగొన్నారు. దీంతో పుస్తకం ముద్రణకు పంపడానికి ముందే లీక్ అయి ఉండవచ్చని దర్యాప్తు అధికారులు అనుమానం వ్యక్తంచేశారు. పీడీఎఫ్ ఫైళ్లకు సంబంధించి పూర్తి వివరాలు ఇవ్వాలని సంస్థను అధికారులు అడిగినట్లు సమాచారం. ముద్రణకు పంపడానికి ముందు ఆ ఫైళ్ల యాక్సెస్ ఎంతమంది వద్ద ఉంది, దాన్ని ఆన్‌లైన్‌లో లేదా ఆఫ్‌లైన్‌లో ఏమైనా షేర్ చేశారా అనే దానిపై వివరణ అడిగారు. దాదాపు మూడేళ్లుగా ఈ పుస్తక ప్రచురణ ప్రక్రియ కొనసాగుతోందని.. సంబంధిత డేటా మొత్తం ఇచ్చేందుకు సమయం కావాలని ఆ సంస్థ, దర్యాప్తుఅధికారులను కోరినట్లు తెలుస్తోంది. ఇక, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల నరవణె పుస్తకాన్ని పార్లమెంటు వద్ద ప్రదర్శించిన సంగతి తెలిసిందే. ఈ పుస్తకం విదేశాల్లో, ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో ఈ హార్డ్‌కాపీ అసలు ఎక్కడినుంచి వచ్చిందనే విషయం తెలుసుకోవడంపై అధికారులు దృష్టిసారించారు. ఈ లీక్ నిర్లక్ష్యం వల్ల జరిగిందా.. లేక కుట్రలో భాగంగానే చేశారా అనే కోణంలో విశ్లేషిస్తున్నారు.

## హసీనా అప్పగింతను కోరతాం: బీఎన్‌పీ

భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను తమకు అప్పగించాలని కోరతామని బీఎన్‌పీ వెల్లడించింది. ''ఇది రెండు దేశాల విదేశాంగ శాఖలు నిర్ణయించాల్సిన అంశం. విచారణ ఎదుర్కొనేందుకు ఆమెను స్వదేశానికి పంపించాలని భారత ప్రభుత్వాన్ని కోరతాం'' అని ఆ పార్టీ ప్రతినిధి సలాహుద్దీన్ అహ్మద్ అన్నారు. విద్యార్థుల ఆందోళనలతో ప్రధాని పదవి వీడిన షేక్ హసీనా.. 2024 ఆగస్టు నుంచి భారత్‌లోనే ఉంటున్నారు. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారనే కేసుల్లో స్వదేశంలోని 'ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్' ఆమెకు మరణ శిక్ష విధించింది. వేరే ఇతర కేసుల్లోనూ ఆమెకు శిక్షలు పడ్డాయి. గతంలోనూ ఆమె అప్పగింతకు సంబంధించి అభ్యర్థనలు వచ్చాయి. హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ చేసిన అభ్యర్థనను పరిశీలిస్తున్నామని భారత్ ఇప్పటికే చెప్పిన



సంగతి తెలిసిందే. గురువారం జరిగిన బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఎన్‌పీ విజయం సాధించింది. మాజీ ప్రధాని ఖాలిదా జియా కుమారుడు తారిఖ్ రహ్మాన్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు కానుంది. ఈ నేపథ్యంలోనే హసీనా గురించి ఆ పార్టీ స్పందించింది.

## బంగ్లా పీఠంపై 'డార్క్ ప్రిన్స్'.. భారత్‌తో స్నేహమా? రణమా?

బంగ్లాదేశ్‌లో దాదాపు రెండున్నర దశాబ్దాల తర్వాత బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ అధికారం చేజిక్కించుకుంది. తాజాగా జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మూడొంతుల మెజార్టీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతోంది. 60 ఏళ్ల తారిఖ్ రహ్మాన్ తదుపరి ప్రధానిగా దేశ పగ్గాలు అందుకోనున్నారు. ఒకప్పుడు విమర్శకుల చేత 'డార్క్ ప్రిన్స్'గా మాటలు పడిన రహ్మాన్‌కు ఈ విజయం ఓ కొత్త ఆరంభమే. మరి ఆయన గెలుపు భారత్‌కు లాభమేనా? రహ్మాన్ రాక మనకు ఏ మేరకు ఉపయోగపడనుంది..?

**17 ఏళ్ల ప్రవాసం వీడి..**

బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు జియావుర్ రహ్మాన్, మాజీ ప్రధాని ఖాలిదా జియా కుమారుడే తారిఖ్ రహ్మాన్. 2002-2006 మధ్య ఖాలిదా జియా అధికారంలో ఉన్న సమయంలో రహ్మాన్ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరించారు. ఆ సమయంలోనే ఆయనపై పలు అవినీతి కేసులు నమోదయ్యాయి. ప్రభుత్వానికి సమాంతరంగా పాలన సాగిస్తున్నారనే ఆరోపణలు కూడా వచ్చాయి. దీంతో అమెరికా సహా బంగ్లా విపక్షాలు ఆయనను 'డార్క్ ప్రిన్స్'గా అభివర్ణించాయి. హసీనా అధికారంలోకి వచ్చిన తర్వాత రహ్మాన్ ఓ కేసులో అరెస్టయి బెయిల్‌పై విడుదలయ్యారు. ఆ తర్వాత అనారోగ్యానికి గురై చికిత్స నిమిత్తం 2008లో లండన్ వెళ్లిపోయారు. అప్పటినుంచి అక్కడే నివసిస్తూ అక్కడినుంచే బీఎన్‌పీ కార్యకలాపాలను పర్యవేక్షించారు. గతేడాది డిసెంబరులో తల్లి ఖాలిదా జియా అనారోగ్యానికి గురవడంతో 17 ఏళ్ల తర్వాత మళ్లీ సొంతగడ్డపై అడుగుపెట్టారు. తల్లి మరణానంతరం పార్టీ పగ్గాలు అందుకున్నారు. నిరసనలు, హింసాత్మక ఘటనలతో అస్థిరంగా మారిన దేశంలో మళ్లీ ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని తీసుకొచ్చే దిశగా విస్తృత ప్రచారం చేపట్టారు. 'బంగ్లా ఫస్ట్' నినాదంతో యువతను ఆకర్షించారు. అవి ఫలించి తాజా ఎన్నికల్లో ఘన విజయాన్ని దక్కించుకున్నారు.

**భారత్ స్నేహ వీచిక..**

ఇటీవల కాలంలో భారత్, బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. షేక్ హసీనా గద్దె దిగడం, మైనార్టీలైన హిందువులపై బంగ్లాదేశ్‌లో దాడులు ఇరుదేశాల బంధాన్ని ఊగిసలాటలో పడేశాయి. రెండు దేశాల మధ్య గత 18 నెలలుగా ద్వైపాక్షిక సమావేశాలు జరగలేదు. ఈ పరిణామాల వేళ ఎన్నికల్లో రహ్మాన్ విజయం కీలకంగా మారింది. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ పోస్ట్ ప్రాధాన్యం సంతరించుకుంది. చైనా, పాకిస్థాన్ కంటే ముందుగానే బంగ్లాదేశ్‌లో నూతన నాయకత్వాన్ని స్వాగతిస్తూ భారత ప్రధాని పోస్ట్ చేశారు. ప్రజాస్వామ్య, ప్రగతిశీల బంగ్లాదేశ్‌కు భారత్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మోదీ పోస్ట్‌కు బీఎన్‌పీ ధన్యవాదాలు తెలిపింది.

*** రహ్మాన్ రాక సానుకూలమే కానీ..**

ఈ ఎన్నికలను భారత్ ముందునుంచీ నిశితంగా గమనించింది. ముఖ్యంగా జమాత్‌ఏఇస్లామీ పార్టీని తారిఖ్ రహ్మాన్ దూరం పెట్టడం భారత్‌కు కలిసొచ్చింది. ఆ పార్టీ ప్రాబల్యం లేకపోతే.. న్యూదిల్లీ విషయంలో రహ్మాన్ సానుకూలంగా వ్యవహరించే అవకాశం ఉందనేది రాజకీయ విశ్లేషకుల మాట. గతంలో రహ్మాన్ తల్లి ఖాలిదా జియా హయాంలో భారత్‌తో సంబంధాలు అంతంతమాత్రంగానే ఉండేవి. నాడు బంగ్లాదేశ్ మనతో పూర్తిగా బంధం తెంచుకోలేదు కానీ.. మిత్రపక్షంగా మాత్రం కొనసాగలేదు. అయితే, ఇప్పుడు రహ్మాన్ నేతృత్వంలో పరిస్థితి మునుపటిలా ఉండకపోవచ్చని అంచనాలు వ్యక్తమవుతున్నాయి. రహ్మాన్ విదేశీ విధానాలు ఖాలిదాకు భిన్నంగా ఉండటమే ఇందుకు కారణం. భారత్ ప్రయోజనాలను గౌరవిస్తామని స్వయంగా ఆయనే ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. తాను 'రీసెట్' కోరుకుంటున్నానని, అయితే, అది రెండు దేశాల నిర్ణయాలపై ఆధారపడి ఉంటుందని అన్నారు. ఇక, ఉగ్రవాదంపై పోరుకు సహకరిస్తామని, తీస్తా నదీ జలాల సమస్యను పరిష్కరించుకుంటామని, హిందూ



మైనార్టీలకు రక్షణ కల్పిస్తామని ఎన్నికల ముందు ఆయన హామీ ఇచ్చారు. సరిహద్దు నియంత్రణ విషయంలో రహ్మాన్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్న దానిపై భారత్ దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే, పశ్చిమబెంగాల్, అస్సాంలో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లో అక్రమ వలసదారుల అంశమే ఎన్నికల్లో కీలకంగా మారింది. భారత్, బంగ్లాదేశ్ 4,100 కిలోమీటర్ల మేర సరిహద్దును పంచుకుంటున్నాయి. 2024 జూన్ తర్వాత నుంచి దాదాపు 1000కి పైగా చొరబాటు ఘటనలు చోటుచేసుకున్నాయి.

**మనతో వాణిజ్యమూ కీలకాంశమే..**

భారత్, బంగ్లాదేశ్ మధ్య ఏటా 14 బిలియన్ డాలర్ల ద్వైపాక్షిక వాణిజ్యం జరుగుతోంది. అయితే, ఇందులో దాదాపు 10 బిలియన్ డాలర్ల వరకు మనకు వాణిజ్య మిగులే ఉంటోంది. మన దేశం నుంచి బంగ్లాదేశ్ టీ, కాఫీ, ఆటో విడిభాగాలు, విద్యుత్, ఉక్కు, స్టీల్, ప్లాస్టిక్, పత్తి వంటివి దిగుమతి చేసుకుంటోంది. బంగ్లా పత్తి దిగుమతుల్లో 80శాతం మన దేశం నుంచే వెళ్తోంది. ఇది ఆ దేశ ఆర్థికవ్యవస్థకు అత్యంత కీలకం. కాబట్టి దేశ ప్రయోజనాలను దృష్టిలోపెట్టుకుని భారత్‌తో రహ్మాన్ దౌత్య సంబంధాలు నెరిపే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## కరేబియన్ సముద్రం నుంచి ఇరాన్ దిశగా అమెరికా యుద్ధ నౌకలు


అమెరికాఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతోన్న నేపథ్యంలో ఆ దేశంపై చర్యలకు అమెరికా సిద్ధమవుతోంది. ఇందులోభాగంగా ఇప్పటికే భారీస్థాయిలో అమెరికా సైన్యం ఇరాన్‌ను చుట్టుముట్టింది. తాజాగా అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ కరేబియన్ సముద్రం నుంచి ఇరాన్ వైపు కదిలినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. మే ప్రారంభం వరకు ఈ నౌక అక్కడే ఉండనున్నట్లు న్యూయార్క్ టైమ్స్ నివేదించింది. ఇరాన్ పాలకులపై ఒత్తిడి పెంచేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే అగ్రరాజ్యానికి చెందిన యుద్ధ విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌ను పశ్చిమాసియాకు తరలించారు. తాజాగా జెరాల్డ్



ఆర్ ఫోర్డ్‌తో పాటు యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ ట్రూయాన్స్ డెస్ట్రాయర్లు, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీలను ఇరాన్ వైపు తరలిస్తుండడంతో అమెరికా ఏ క్షణాన దాడి చేస్తుందోనన్న భయాందోళనలు నెలకొన్నాయి. ఇటీవల అమెరికా వెనెజువెలాపై దాడి చేసి, మదురోను బంధించిన సమయంలోనూ యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ విమాన వాహక నౌక నుంచే యుద్ధ విమానాలు దాడిలో పాల్గొన్నట్లు పలు నివేదికలు వెల్లడించాయి. ఒమన్ వేదికగా ఇరాన్, అమెరికా మధ్య పరోక్ష చర్చలు జరుగుతున్నాయి. ఒకవేళ ఈ చర్చలు విఫలమైతే దాడులకు దిగుతామని అగ్రరాజ్యం సంకేతాలిచ్చింది. ఈ నేపథ్యంలో యూఎస్ విమాన వాహక నౌక ఇరాన్ దిశగా కదలుతుండడం పశ్చిమాసియాలో ఆందోళనలు లేవనెత్తుతోంది.

## అమెరికా విడుదల చేసిన మ్యాప్‌పై పాక్ గగ్గోలు..

భారత్‌తో ట్రేడ్‌డీల్‌కు అంగీకారం కుదిరిన వేళ.. అమెరికా వాణిజ్య ప్రతినిధి భారత్ మ్యాప్ ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. దీనిపై పాకిస్థాన్ గగ్గోలు పెట్టింది. చివరకు అగ్రరాజ్య అధికారులకు నచ్చజెప్పి ఆ మ్యాప్‌ను తొలగించేలా చేశారు. కశ్మీర్‌లోని కొంత భాగాన్ని పాకిస్థాన్ చట్టవిరుద్ధంగా ఆక్రమించింది. కశ్మీర్‌ను జీవనాడిగా చెప్తూ.. ఉగ్రవాదాన్ని



ఎగదోస్తోంది. ఇలాంటి సమయంలో దాయాది పేర్కొంటున్నట్టుగా కాకుండా.. భారత్ మ్యాప్ ఉన్నది ఉన్నట్టుగా అమెరికా షేర్ చేసింది. దీన్నిచూసి తట్టుకోలేకపోయిన పాకిస్థాన్.. అమెరికా అధికారులను ఒప్పించి, దాన్ని తొలగించాలని ప్రాధేయపడటంతో వారు దానిని తొలగించారు. మ్యాప్ షేర్ చేయగానే తాము వెంటనే అగ్రరాజ్య అధికారులను సంప్రదించామని పాక్ విదేశాంగశాఖ ప్రతినిధి తాహిర్ అంద్రాబి వెల్లడించడమే ఇందుకు నిదర్శనం. కాగా.. కశ్మీర్ విషయంలో భారత్ తన వైఖరిని బలంగా వినిపిస్తోంది. ఎప్పటికీ కశ్మీర్ భారత భూభాగమేనని తేల్చిచెప్పింది. పాక్ ఆక్రమిత కశ్మీర్ లేకుండా జమ్మూకశ్మీర్ అసంపూర్ణమని గతంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. పాకిస్థాన్‌కు పీవోకే విదేశీ భూభాగం అవుతుందే తప్ప మరొకటి కాదని అన్నారు.

## 'ఏఐ' ఎఫెక్ట్... స్టాక్ మార్కెట్లకు భారీ నష్టాలు

**వరుసగా రెండో రోజూ భారీ నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు**

**1,048 పాయింట్లు పతనమైన సెన్సెక్స్, 336 పాయింట్లు కోల్పోయిన నిఫ్టీ**

**భారత ఔట్‌సోర్సింగ్ మోడల్‌పై ఏఐ ప్రభావం చూపుతుందనే ఆందోళనలే కారణం**

**అన్ని రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి, మెటల్ షేర్లు అత్యధికంగా పతనం**

**కీలక స్థాయిల దిగువకు పడిపోయిన నిఫ్టీ**




**ముంబై:** భారత ఈక్విటీ మార్కెట్లు వరుసగా రెండో రోజు కూడా భారీ నష్టాల్లో ముగిశాయి. శుక్రవారం ట్రేడింగ్‌లో అమ్మకాల సునామీ వెల్లువెత్తడంతో సూచీలు కుప్పకూలాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కారణంగా భారత ఔట్‌సోర్సింగ్ మోడల్‌కు ముప్పు వాటిల్లుతుందనే అంతర్జాతీయ ఆందోళనలు ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను తీవ్రంగా దెబ్బతీశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 1,048 పాయింట్లు నష్టపోయి 82,626 వద్ద స్థిరపడింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 336 పాయింట్లు పతనమై 25,471 వద్ద ముగిసింది. బెంచ్‌మార్క్ సూచీలతో పాటు మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లలోనూ అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.71 శాతం పడిపోగా, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 1.79 శాతం మేర క్షీణించింది.

రంగాల వారీగా చూస్తే అన్ని సూచీలు నష్టాల్లోనే ముగిశాయి. ముఖ్యంగా నిఫ్టీ మెటల్ ఇండెక్స్ 3.31 శాతం పతనమై టాప్ లూజర్‌గా నిలిచింది. రియల్టీ, ఐటీ, ఎఫ్ఎంసీజీ రంగాలు కూడా భారీ నష్టాలను చవిచూశాయి. నిఫ్టీ 50లోని 44 షేర్లు నష్టాల్లో ముగియడం మార్కెట్ బలహీనతను సూచిస్తోంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ 6 పైసలు బలహీనపడి 90.61 వద్ద ట్రేడ్ అయింది.

సాంకేతికంగా నిఫ్టీ తన కీలకమైన 21, 50, 100-రోజుల చలన సగటుల దిగువకు పడిపోయిందని విశ్లేషకులు తెలిపారు. "బ్యాంక్ నిఫ్టీ స్వల్పకాలిక కన్సాలిడేషన్ రేంజ్ నుంచి కిందకి జారింది. ఇది స్వల్ప లాభాల స్వీకరణను సూచిస్తుంది. అయితే, 59,700 వద్ద ఉన్న 20-రోజుల చలన సగటు కీలక మద్దతుగా కొనసాగుతోంది" అని ఎల్కేపీ సెక్యూరిటీస్ టెక్నికల్ అనలిస్ట్ వత్సల్ భువా వివరించారు.

## ట్రెండింగ్‌లోకి 'డొమైన్ నేమ్'.. రూ.కోట్లు కురిపించిన పేర్లు..!




**న్యూఢిల్లీ:** వెబ్‌సైట్‌లను యాక్సెస్ చేయడానికి ఉపయోగించే డొమైన్ నేమ్ ఇప్పుడు ట్రెండింగ్‌గా మారింది. 30 ఏళ్ల క్రితం రూ.300 పెట్టుబడితో కొనుగోలు చేసిన ఒక డొమైన్ ఇప్పుడు రూ.634 కోట్లు పలికిందన్న వార్త సంచలనంగా మారింది. గతంలోనూ ఇలాంటి సందర్భాలు ఉన్నాయి.

మలేసియాకు చెందిన వ్యాపారవేత్త అరిసాన్ ఇస్మాయిల్ 'ఎ.ఇ.నీఎ' డొమైన్‌ను క్రిప్టో.కామ్ సీఈఓ 70 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేశారు. అంటే సుమారు రూ.634 కోట్లు. ఈ డీల్ ఏప్రిల్ 2025లోనే జరిగింది. అయితే దీనిని సూపర్ బౌల్ ఎల్ఎక్స్ (అమెరికన్ ఫుట్‌బాల్ గేమ్) సందర్భంగా రీలాంచ్ చేయడంతో తాజాగా ఈ ఒప్పందం వెలుగులోకి వచ్చింది. అయితే ఇస్మాయిల్ డొమైన్‌ను కొనుగోలు చేసిన విషయంలో భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. ఇస్మాయిల్ 1993లో 10 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు రూ.300తో కొనుగోలు చేసినట్లు కొన్ని కథనాలు పేర్కొనగా, 2021లో డొమైన్ బ్రోకరేజ్ సైట్ ఎంచి.ఇనీఎ నుంచి ఇస్మాయిల్ ఈ డొమైన్‌ను కొన్నట్టు మరికొన్ని కథనాలు రాసుకొచ్చాయి. అయితే అప్పుడు అతడు ఎంత మొత్తం వెచ్చించాడన్న దానిపై మాత్రం స్పష్టత లేదు. అంతకుముందు దాని యజమాని ఫ్యూచర్ మీడియా ఆర్కిటెక్ట్స్ అని, అది డొమైన్ నేమ్స్ హోల్డింగ్ కంపెనీ అని వెల్లడించాయి. గతంలోనూ పలు డొమైన్ నేమ్స్ భారీ ధర పలికాయి.

అత్యంత విలువైన డొమైన్ నేమ్‌గా దీనికి పేరుంది. తొలుత ఇది క్లాసిఫైడ్ వెంచర్స్ చేతిలో ఉండగా.. 2016లో కార్ డీలర్ రివ్యూ వెబ్‌సైట్ డీలర్ రేటర్ కొనుగోలు చేసింది.

బిజినెస్.కామ్ 2007లో 2 మిలియన్ డాలర్లకు అమ్ముడైంది. అయితే ఆ సమయంలో దాని స్టాక్స్ 345 మిలియన్ డాలర్లు పలికాయి. దాంతో అదికూడా అత్యంత విలువైన డొమైన్లలో ఒకటిగా నిలిచింది. వ్యాపారాన్ని ఎలా ప్రారంభించాలనే టిప్స్‌ను ఈ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు. పర్యాటక రంగంలో లొకేషన్ ఆధారిత డొమైన్లు ఎంత కీలకమో ఇది వెల్లడి చేస్తోంది. దీనిని 90 మిలియన్ డాలర్లకు లాస్‌వెగాస్ కన్వెన్షన్ అండ్ విజిటర్స్ అథారిటీ కొనుగోలు చేసింది. కార్ ఇన్సూరెన్స్ ఇండస్ట్రీలో కీలకమైన కార్‌ఇన్సూరెన్స్.కామ్ 49.7 మిలియన్ డాలర్లకు, సరసమైన ధరల్లో ఇన్సూరెన్స్ ప్లాన్ల గురించి చిట్కాలు అందించే ఇన్సూరెన్స్.కామ్ 35.6 మిలియన్ డాలర్లకు అమ్ముడయ్యాయి. ఇలా ఒక పేరుతో రూ.కోట్లు తెచ్చిపెట్టిన డొమైన్లు చాలానే ఉన్నాయి. భవిష్యత్తును ముందుగానే అంచనా వేసి రిజిస్టర్ చేసుకున్న వారిని కోటీశ్వరులుగా మార్చాయి.

## భారత్‌లో రోల్స్ రాయిస్ భారీ ప్రణాళికలు

**యుద్ధ విమానాల ఇంజిన్ల సహ-అభివృద్ధి**

**వెల్లడించిన సీఈఓ తూఫాన్ ఎర్గిన్‌బిల్గిచ్**




**న్యూఢిల్లీ:** మనదేశంలో రక్షణ, ఇంధన, పౌర విమానయాన రంగాల్లో తన కార్యకలాపాలు పెంచుతామని బ్రిటన్ దిగ్గజ సంస్థ రోల్స్ రాయిస్ వెల్లడించింది. భారత తదుపరి తరం యుద్ధ విమానాల కోసం అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ (ఏఎమ్‌సీఏ) ప్రోగ్రామ్ కింద ఏరో-ఇంజిన్‌ను ఉమ్మడిగా అభివృద్ధి చేయనున్నట్లు కంపెనీ సీఈఓ తూఫాన్ ఎర్గిన్‌బిల్గిచ్ తెలిపారు. అది కూడా పూర్తిగా మేధోసంపత్తి హక్కుల బదిలీతో చేపట్టనున్నట్లు వివరించారు. ప్రస్తుతం 1,400కు పైగా రోల్స్‌రోయిస్ ఇంజిన్లు భారత త్రివిధ దళాల్లోని వివిధ రక్షణ ప్లాట్‌ఫారాలలో సేవలందిస్తున్నాయని తెలిపారు.

**సిబ్బంది సంఖ్య రెట్టింపు..**

దేశంలో కంపెనీకి ఉన్న సిబ్బందిని రెట్టింపు చేసి 10,000కు చేర్చాలనీ సంస్థ భావిస్తోంది. తన అత్యాధునిక తయారీకి భారత్‌ను అంతర్జాతీయ కేంద్రంగా మార్చే దీర్ఘకాల లక్ష్యంతో స్థానిక సరఫరా వ్యవస్థ వనరులను పదింతలు చేసుకోవాలనీ చూస్తోంది. దీనివల్ల పలు ఎస్ఎమ్ఈ(చిన్న, మధ్య తరహా కంపెనీలు)లకు ప్రయోజనం దక్కనుంది. 'ఇతర దేశాల్లో విజయవంతంగా మా వ్యవస్థను విస్తరించినట్లుగానే, భారత్‌లోనూ రక్షణ, విమాన, ఇంధన రంగాల్లో వృద్ధి చెందాలని భావిస్తున్న'ట్లు తూఫాన్ అన్నారు. ప్రధాని మోదీతో పాటు, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్, వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్‌తో ఆయన వేర్వేరుగా సమావేశమయ్యారు. 'భారత్‌లో తన కార్యక్రమాలను పెంచుకోవాలన్న రోల్స్‌రాయి స్ ఉత్సాహాన్ని మేం స్వాగతిస్తున్నామ'ని మోదీ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు.

హెచ్ఏఎల్, ఫోర్స్ మోటార్స్‌తో తయారీ సంయుక్త సంస్థలు; టాటా, భారత్ ఫోర్జ్, గోద్రేజ్ వంటి 100కు పైగా వెండార్లతో సోర్సింగ్ భాగస్వామ్యాలు ఈ కంపెనీకి ఉన్నాయి.

# పాక్‌తో మ్యాచ్‌లో అభిషేక్ ఆడే అవకాశం ఉంది

**వరుణ్ చక్రవర్తి**

న్యూఢిల్లీ: టీ20 వరల్డ్‌కప్‌లో ఆదివారం పాకిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో అభిషేక్ శర్మ ఆడే అవకాశాలు ఉన్నట్లు భారత స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి తెలిపాడు. కడుపు ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న అభిషేక్.. గురువారం నమిబియాతో జరిగిన మ్యాచ్‌లో ఆడని విషయం తెలిసిందే. అయితే అభిషేక్ శర్మ ఆరోగ్యం ప్రస్తుతం బాగానే ఉన్నట్లు వరుణ్ చెప్పాడు. ఆరోగ్యం క్షీణించడం వల్ల రెండు రోజుల పాటు అభిషేక్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నాడు. అభిషేక్‌తో మాట్లాడానని, అతను బాగానే ఉన్నాడని, ఇవాళ కొంత ప్రాక్టీస్ చేశాడని, సిద్ధం అవుతున్నట్లు అతను చెప్పాడని వరుణ్ చక్రవర్తి పేర్కొన్నాడు.

నమిబియాతో జరిగిన మ్యాచ్‌లో వరుణ్ చక్రవర్తి రెండు ఓవర్లు వేసి 7 పరుగులిచ్చి మూడు వికెట్లు తీసుకున్నాడు. ఆ మ్యాచ్ టాస్ వేసిన సమయంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.. ఒకటి లేదా రెండు మ్యాచ్‌లు అభిషేక్ శర్మ మిస్సయ్యే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్న విషయం తెలిసిందే. అభిషేక్ శర్మ గైర్హాజరీలో నమిబియాతో మ్యాచ్‌లో సంజూ శాంసన్ ఓపెనింగ్ బాధ్యతలు చేపట్టాడు. వరల్డ్‌కప్‌లో ఇండియా వరుసగా తన రెండో మ్యాచ్ నెగ్గింది. నమిబియాపై 93 రన్స్ తేడాతో నెగ్గింది. ఒకవేళ కొలంబోలో జరిగే ప్రాక్టీస్ సెషన్‌లో అభిషేక్ పాల్గొంటే అతను పాక్‌తో మ్యాచ్‌కు ఆడేది లేనిది తేలే అవకాశం ఉంటుంది. నెట్స్‌లో చాలా సమయం అతను బ్యాటింగ్ ప్రాక్టీస్ చేయాల్సి ఉంటుంది. దాని ఆధారంగా ఇండోపాక్ మ్యాచ్‌పై క్లారిటీ వస్తుంది.




## టీ20 వరల్డ్‌కప్‌లో ఆస్ట్రేలియాకు షాక్..

**జింబాబ్వే సంచలన విజయం**



**కొలంబో:** టీ20 వరల్డ్‌కప్‌లో సంచలన నమోదు అయ్యింది. కొలంబోలో ఇవాళ జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియాపై 23 రన్స్ తేడాతో జింబాంబే విక్టరీ కొట్టింది. జింబాబ్వే క్రికెటర్లు అద్భుతమైన ఆటను ప్రదర్శించారు. తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే నిర్ణీత ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 169 రన్స్ చేసింది. జింబాబ్వే ఓపెనర్ బ్రియాన్ బెన్నెట్ అత్యధికంగా 64 రన్స్ స్కోరు చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో ఏడు ఫోర్లు ఉన్నాయి. జింబాబ్వే బ్యాటర్లలో మరుమని 35, ర్యాన్ బర్ల్ 35, సికందర్ రాజా 25 రన్స్ స్కోరు చేశారు. జింబాబ్వే 15 ఓవర్లలో వికెట్ నష్టానికి 125 రన్స్ చేసి భారీ స్కోరు దిశగా అడుగులు వేసింది. కానీ ఆసీస్ బౌలర్లు రాణించడంతో చివరి అయిదు ఓవర్లలో జింబాబ్వేకు 44 రన్స్ మాత్రమే వచ్చాయి.

జింబాబ్వే విసిరిన టార్గెట్‌ను అందుకునే క్రమంలో ఆస్ట్రేలియా చేతులెత్తేసింది. అనూహ్య రీతిలో ఓటమిని ఎదుర్కొన్నది. 19.3 ఓవర్లలో 146 రన్స్ చేసి ఆలౌటైంది. ఆసీస్ బ్యాటర్లలో మాట్ రెన్‌షా 65, మ్యాక్స్‌వెల్ 31 రన్స్ చేశారు. జింబాబ్వే బౌలర్లలో ముజరబానీ 4, బ్రాడ్ ఇవాన్స్ 3 వికెట్లు తీసుకున్నారు. చేజింగ్‌లో కేవలం 29 రన్స్‌కే నాలుగు వికెట్లు కోల్పోయింది ఆస్ట్రేలియా.ఆ తర్వాత అయిదో వికెట్‌కు మ్యాక్స్‌వెల్, రెన్‌షా 77 రన్స్ జోడించారు. కానీ ఆసీస్ మేటి బ్యాటర్లు జట్టుకు విజయాన్ని అందించలేకపోయారు. 4 ఓవర్లలో 17 రన్స్ ఇచ్చి 4 వికెట్లు తీసుకున్న ముజరబానీ .. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు గెలుచుకున్నాడు. టీ20 క్రికెట్‌లో అతను వంద వికెట్ల తీసుకున్న బౌలర్‌గా నిలిచాడు.

## అలా బౌలింగ్ చేస్తే పక్కకు జరగండి..

**ఇండియన్ బ్యాటర్లకు అశ్విన్ సలహా**

**న్యూఢిల్లీ:** పాకిస్థాన్ ఆఫ్ స్పిన్నర్ ఉస్మాన్ తారీఖ్ బౌలింగ్ యాక్షన్ వివాదాస్పదం అవుతున్న విషయం తెలిసిందే. అయితే ఆ బౌలర్‌ను ఎదుర్కొనేందుకు బ్యాటర్లు ఇబ్బంది పడుతున్నారు. బౌలింగ్ చేస్తున్న సమయంలో క్రీజ్ వద్దకు వచ్చిన తర్వాత అతను కాసేపు తన చేయిని ఆపి మళ్లీ బౌలింగ్ చేస్తున్నాడు. దీంతో ఆ బౌలర్‌ను ఆడేందుకు బ్యాటర్లు ఇబ్బందిపడుతున్నారు. ఇక బౌలింగ్ సమయంలో అతని కుడి చేయి 15 డిగ్రీల కన్నా ఎక్కువగా వంగుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. తారీఖ్ బౌలింగ్ గురించి గతంలో ఆస్ట్రేలియా బ్యాటర్ కెమరూన్ గ్రీన్, దక్షిణాఫ్రికా బ్యాటర్ బ్రెవిస్ అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

అయితే టీ20 వరల్డ్‌కప్‌లో భాగంగా ఆదివారం పాకిస్థాన్, ఇండియా మధ్య హైవోల్టేజ్ మ్యాచ్ జరగనున్నది. ఈ నేపథ్యంలో భారత మాజీ స్పిన్నర్ అశ్విన్ మన బ్యాటర్లకు ఓ సలహా ఇచ్చారు. ఉస్మాన్ తారీఖ్ బౌలింగ్ చేస్తున్న సమయంలో .. ఒకవేళ అతను తన చేయిని మధ్యలో ఆపినప్పుడు మీరు పక్కకు జరగాలని ఇండియన్ బ్యాటర్లకు సలహా ఇచ్చాడు అశ్విన్. ఆగి బౌలింగ్ చేస్తున్న యాక్షన్‌తో 30 ఏళ్ల తారీఖ్‌కు ఇప్పటికే టీ20ల్లో మంచి రికార్డు ఉన్నది. టీ20ల్లో అతను 11 వికెట్లు తీసుకున్నాడు. ఆరు కన్నా తక్కువ సగటును పరుగులు ఇచ్చాడు. భారత్‌తో జరిగే మ్యాచ్‌లో అతని బౌలింగ్ కీలకంగా మారే అవకాశం ఉన్నది.



బంతి వేయడానికి ముందు తారీఖ్ ఆగిపోతే.. పక్కకు జరిగే హక్కు బ్యాటర్‌కు ఉంటుందని, అతను ఆగిపోతున్నాడేమో అన్న అనుమానాన్ని వ్యక్తం చేయవచ్చు అని, ఇలాంటి సందర్భాల్లో ఆన్‌ఫీల్డ్ అంపైర్‌కు ఆ సమస్య తలనొప్పిగా మారుతుందని మాజీ బౌలర్ అశ్విన్ పేర్కొన్నాడు. యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అశ్విన్ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ఒకవేళ నేను అక్కడ ఉండి ఉంటే, అలాగే చేసేవాడినని, మ్యాచ్‌ను గెలిచేందుకు రూల్స్ ప్రకారం అన్నీ చేయాల్సి ఉంటుందని, బౌలర్ ఎప్పుడు బంతిని రిలీజ్ చేస్తాడో తనకు తెలియదని చెప్పవచ్చు అని, అప్పుడు పక్కకు జరగవచ్చు అని, ఒకవేళ బ్యాటర్ ఓ వైపు జరిగితే, అప్పుడు అది అంపైర్ బాధ్యత అవుతుందని అశ్విన్ అన్నాడు.

# జడేజాకు చుక్కెదురు..

**రాజస్థాన్ రాయల్స్ సారథిగా ఆటిట్యూడ్ స్టార్..!**

**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ ఫ్రాంచైజీ రాజస్థాన్ రాయల్స్ కొత్త కెప్టెన్ ఎవరు? అనే ప్రశ్నకు తెరపడింది. సుదీర్ఘ కాలం జట్టుతో కొనసాగుతున్న రియాన్ పరాగ్‌కే పగ్గాలు అప్పగించింది యాజమాన్యం. దాంతో, పంతొమ్మిదో సీజన్ వేలానికి ముందు ట్రేడ్ పద్ధతిలో సొంత గూటికి చేరిన రవీంద్ర జడేజా (ఖీజీలతినిటతీజీ ఏజీటవతీజీ) ఐపీఎల్ కెప్టెన్సీ కల చెదిరింది. నిరుడు సంజూ శాంసన్ గైర్హాజరీలో గులాబీ టీమ్‌ను నడిపించిన అతడికే యాజమాన్యం జై కొట్టిందని సమాచారం. ఈ విషయాన్ని శుక్రవారం ఎక్స్ వేదికగా వెల్లడించింది రాజస్థాన్ ఫ్రాంచైజీ.

పద్దెనిమిదో సీజన్ అనంతరం రాజస్థాన్ జట్టుకు సంజూ శాంసన్ గుడ్ బై చెప్పడంతో తదుపరి సారథి? అనే చర్చ మొదలైంది. ట్రేడ్ పద్ధతిలో జట్టులోకి వచ్చిన రవీంద్ర జడేజాకు కెప్టెన్సీ ఇస్తారని.. రియాన్ పరాగ్, యశస్వీ జైస్వాల్, ధ్రువ్ జురెల్ కూడా రేసులో ఉన్నారని కథనాలు వచ్చాయి. కానీ, చివరకు జడ్డూను కూడా కాదని పరాగ్ నయా సారథిగా ఎంపికయ్యాడు. పంతొమ్మిదో సీజన్‌లో అతడి నాయకత్వంలోనే రాజస్థాన్ ఆడనుంది.



## 'కపుల్ ఫ్రెండ్లీ'తో తెరపైకి తెలంగాణ బ్యూటీ!



**టాకీస్:** తెలుగు తెరపై ఈ మధ్య కాలంలో తెలుగు హీరోయిన్స్ జోరు పెరుగుతున్నట్టుగానే కనిపిస్తోంది. కొత్తగా ఇండస్ట్రీకి వస్తున్న దర్శకులు, కొత్త కథానాయికలను పరిచయం చేయడానికి ఎక్కువ ఉత్సాహాన్ని చూపిస్తున్నారు. ఓ మాదిరి బడ్జెట్ సినిమాల ద్వారా పరిచయమవుతున్న ఈ కథానాయికలు, ఆ తరువాత తమ టాలెంట్ తో నిలదొక్కుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అటు ఆంధ్ర నుంచి మాత్రమే కాదు, ఇటు తెలంగాణ వైపు నుంచి కూడా పరిచయమవుతున్న హీరోయిన్ల సంఖ్య కూడా పెరుగుతోంది.

వరంగల్ నుంచి తెలుగు తెరకి పరిచయమైన ఆనంది, తమిళంలో స్టార్ డమ్ ను సంపాదించుకుంది. ఇప్పటికీ తెలుగులో సినిమాలు చేస్తోంది. ఈషా రెబ్బా కూడా తనదైన స్టైల్లో సినిమాలు .. సిరీస్ లు చేస్తూ వెళుతోంది. ఇక వైష్ణవి చైతన్య 'బేబీ' సినిమాతో సృష్టించిన సంచలనం అంతా ఇంతా కాదు. ఈ నేపథ్యంలో ఇప్పుడు 'మానస వారణాసి' పేరు ఎక్కువగా వినిపిస్తోంది. అందాల పోటీల్లో అనేక బహుమతులు గెలుచుకున్న ఈ బ్యూటీ, ఇప్పుడు 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాతో అలరించనుంది.

మానస వారణాసి ఇంతకు ముందు ఒక సినిమా చేసినప్పటికీ, కొన్ని కారణాల వలన అది ఆడియన్స్ కి రీచ్ కాలేదు. 'వాలెంటైన్స్ డే' సందర్భంగా ఈ నెల 14వ తేదీన ఈ సినిమాను రిలీజ్ చేస్తూ ఉండటంతో, యూత్ అంతా ఈ సినిమాపైనే ఫోకస్ పెట్టింది.

## ఓటీటీలోకి 'శ్రీ చిదంబరం గారు'




**టాకీస్:** టాలీవుడ్ నుంచి చిన్న సినిమాగా వచ్చి ప్రశంసలు అందుకున్న 'శ్రీ చిదంబరం గారు' చిత్రం విడుదలైన వారంలోపే ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను ప్రకటించింది. ఫిబ్రవరి 06న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురాగా.. అతి తక్కువ కాలంలోనే డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. వినయ్ రత్నం దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫీల్-గుడ్ డ్రామా ఓటీటీ హక్కులను ప్రముఖ సంస్థ ఇఎం చితిని కైవసం చేసుకుంది. దీంతో ఈ సినిమాను ఫిబ్రవరి 19 నుంచి స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు ఈటీవీ విన్ ప్రకటించింది. యువ నటులు వంశీ తుమ్మల, సంధ్య వశిష్ట ప్రధాన పాత్రల్లో నటించగా.. ఈ చిత్రాన్ని చింతా వినీషా రెడ్డి, చింతా గోపాలకృష్ణ రెడ్డి నిర్మించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. రాజమండ్రిలోని ఒక పల్లెటూరిలో నివసించే సోలమన్ (వంశీ తుమ్మల)కు మెల్లకన్ను ఉంటుంది. దీంతో ఊరిలో ఉన్నవారందరూ అతడిని 'చిదంబరం' అని ఎగతాళి చేస్తుంటారు. ఈ అవమానాన్ని తట్టుకోలేక సోలమాన్ తన చిన్నప్పుడే చదువు మానేస్తాడు. తన లోపాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఎప్పుడూ కళ్లజోడు ధరిస్తుంటాడు.




## కుర్రాళ్లను కవ్విస్తున్న పూజిత పొన్నాడ

టాకీస్: 2016లో కింగ్ నాగార్జున నటించిన ఊపిరి సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది పూజిత పొన్నాడ. ఆ తర్వాత అక్కినేని హీరో నాగ చైతన్య ప్రేమమ్ సినిమాలో కాలేజ్ స్టూడెంట్ గా కనిపించింది. ఈ రెండు సినిమాల్లో తన క్యూట్ నెస్ తో ఆకట్టుకుంది పూజిత. కాగా పూజితకు మంచి గుర్తింపు తీసుకొచ్చిన సినిమా ఏదంటే రామ్ చరణ్ రంగస్థలం అనే చెప్పాలి. ఇందులో హీరో ఆది పినిశెట్టి ప్రియురాలు పద్మ పాత్రలో ఆమె అభినయం అందరినీ ఆకట్టుకుంది. సినిమాలో కనిపించింది కొంత సేపే అయినా తన నటనతో ఆకట్టుకుంది పూజిత. రంగస్థలం సినిమా తర్వాత వరుస అవకాశాలు అందుకుంది ఈ అమ్మడు. ఆ తర్వాత రాజుగాడు, బ్రాండ్ బాబు, హ్యాపీ వెడ్డింగ్, కల్కి, వేర్ ఈజ్ వెంకట లక్ష్మి, రన్, మిస్ ఇండియా, కథ కంచికి మనం ఇంటికి, ఓదెల రైల్వే స్టేషన్ తదితర సినిమాల్లో నటించింది పూజిత. అలాగే రవితేజ రావణాసుర సినిమాల్లో మరో కీలక పాత్ర పోషించింది. అయితే ఎందుకోకానీ ఈ ముద్దుగుమ్మ క్రేజ్ మాత్రం రావడం లేదు. వరుసగా సినిమాలు చేస్తునా.. అందం అభినయం రెండూ ఉన్న కూడా ఈ అమ్మడికి అంతగా గుర్తింపు రావడంలేదు. ఇటీవల పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమాలో పూజిత కూడా కనిపించింది. ఓ స్పెషల్ సాంగ్ లో మెరిసింది ఈ భామ. అలాగే ఓ తమిళ సినిమాలోనూ నటిస్తోందీ అందాల తార. తాజాగా సోషల్ మీడి యాలో అదిరిపోయే ఫో టోలను పంచుకుంది.

**టాకీస్:** విష్వక్‌సేన్ వరుస సినిమాలతో అలరిస్తున్నప్పటికీ విజయం దక్కిన సినిమాలు తక్కువే. 'జాతి రత్నాలు'తో విజయాన్ని అందుకున్న దర్శకుడు కేవీ అనుదీప్ కాంబినేషన్‌లో వచ్చిన తాజా చిత్రమే 'ఫంకీ'. ఓ కొత్త దర్శకుడు. మంచి ప్రొడక్షన్స్ అనే నిర్మాణ సంస్థలో అవకాశం అందుకుని రూ.4 కోట్లలో పూర్తి చేస్తానని చెప్పి 'ఫంకీ' అనే సినిమాని మొదలు పెడతాడు. ఆ బడ్జెట్ కాస్త రూ.40 కోట్లకు చేరినా సినిమా పూర్తి కాదు. దాంతో మంచి నిర్మాత (నరేశ్) ఒత్తిడికి గురై ఆస్పత్రిలో చేరాల్సి వస్తుంది. అది తెలుసుకున్న నిర్మాత కుమార్తె చిత్ర (కయాదు లోహార్) సినిమా బాధ్యతల్ని తీసుకుంటుంది. బడ్జెట్ పెరగకుండా దర్శకుడితో మూవీ చేయిస్తానని చెప్పి, రంగంలోకి దిగుతుంది. మరి అనుకున్న బడ్జెట్‌లోనే కోమల్‌తో సినిమాని పూర్తి చేయించిందా?అది పూర్తయ్యేలోపు ఆ

## కథాకథనంలో కనిపించని కెమిస్ట్రీ ఫర్వా లేదనిపించేలా ఫంకీ మూవీ




ఇద్దరి మధ్య ఏం జరిగిందన్నదే చిత్రకథ. కథ కంటే ఇందులో నవ్వులే కీలకమని నిర్మాత నాగవంశీ ముందే ప్రేక్షకుల్ని సిద్ధం చేశారు. ఆయన చెప్పినట్టే అనుదీప్ మార్క్ పాత్రలు, సంభాషణలు ఈ సినిమాకి కీలకం. అయితే సినిమాకి కథ కూడా అవసరమే అనే విషయాన్ని 'ఫంకీ' అడుగడుగునా గుర్తు చేస్తుంది. సరైన కథంటూ లేకపోతే మిగతా హంగులు ఎన్ని ఉన్నా అవేవీ పెద్దగా ప్రభావం చూపించవని ఈ సినిమా మరోమారు నిరూపిస్తుంది. 'జాతిరత్నాలు'తో తెలుగు ప్రేక్షకులకు ఓ కొత్త రకమైన హాస్యాన్ని పరిచయం చేశారు అనుదీప్. అమాయకత్వం నిండిన పాత్రలు చేసే అల్లరి, ఆ పాత్రలు మాట్లాడుకునే విధానం నుంచి పండిన హాస్యం ప్రేక్షకులకు గమ్మత్తుగా అనిపించింది.

## ఓటీటీలో కాదు..నేరుగా థియేటర్లకే

### మార్చి 6న సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని విడుదల

టాకీస్: నటుడు శివాజీ వరుస చిత్రాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఆయన స్వీయ నిర్మాణంలో శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందిన తాజా చిత్రం 'సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని' విడుదల విషయంలో ఆసక్తికర మలుపు చోటుచేసుకుంది. మొదట ఈ సినిమాను నేరుగా ఓటీటీలో విడుదల చేయాలని నిర్ణయించిన చిత్రబృందం, చివరి నిమిషంలో థియేట్రికల్ రిలీజ్ వైపు మళ్లింది. ఈ చిత్రంలో శివాజీకి జోడీగా సీనియర్ నటి లయ నటించారు. ప్రారంభంగా ఈ సినిమానుఈటీవీ విన్ వేదికగా ఫిబ్రవరి 12 నుంచే స్ట్రీమ్రింగ్ చేయనున్నట్లు ప్రకటించారు. అందుకు అనుగుణంగా ప్రమోషన్లు కూడా నిర్వహించారు. అయితే ట్రైలర్‌కు వచ్చిన స్పందన, ప్రేక్షకుల ఆసక్తి దృష్ట్యా చిన్న తెరపై కాకుండా ముందుగా వెండితెరపైకి తీసుకురావాలనే నిర్ణయానికి మేకర్స్ వచ్చారు. దీంతో ఇప్పుడు ఈ చిత్రాన్ని మార్చి 6న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు అధికారికంగా ప్రకటించారు. 'వచ్చే నెల 6న థియేటర్స్‌లో కలుద్దాం' అంటూ శివాజీ సోషల్ మీడియాలో పోస్టు చేయడం ద్వారా ఈ విషయాన్ని స్పష్టం చేశారు. ప్రేక్షకుల డిమాండ్ మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. ఇక ఈ




సినిమాకు సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహించగా, రోహన్, ప్రిన్స్, అలీ, ధనరాజ్, ఇమ్మాన్యుయేల్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. సంగీతాన్ని రంజిన్ రాజ్ అందించారు. నటుడు, నిర్మాత బండ్ల గణెెశ్ ప్రత్యేకంగా 'పాయా పాయా' పాటను రూపొందించడం ఈ చిత్రానికి మరింత హైలైట్‌గా నిలిచింది.

## ఓటీటీలోనూ మనశంకర వరప్రసాద్ గారు దూకుడు

టాకీస్: చిరంజీవి హీరోగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన 'మన శంకరవరప్రసాద్ గారు' థియేటర్‌లలో సందడి చేసి రికార్డులు సృష్టించిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ సినిమా ఓటీటీలోనూ హవా చూపిస్తోంది. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ చిత్రం నెల రోజుల తర్వాత ఫిబ్రవరి 11న జీ5 వేదికగా స్ట్రీమ్రింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. అక్కడ కూడా ఒక్క రోజులోనే రికార్డును సృష్టించింది.

ఏకంగా 24 గంటల్లో 200 మిలియన్ల మినిట్స్‌ను సొంతం చేసుకుంది. డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో ఇది ఓ కొత్త రికార్డ్ అని సంస్థ జి5 సంస్థ వెల్లడించింది. థియేటర్‌లోనే కాదు.. ఓటీటీలోనూ మరిన్ని రికార్డులు తన ఖాతాలో వేసుకోవడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు. కామెడీ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా రూ.375 కోట్లు వసూలు చేసి చిరు కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల లిస్ట్‌లో చేరింది. ఈ విజయంపై చిరంజీవి గతంలో మాట్లాడారు. 'వెండితెర మీద నన్ను చూడగానే మీరు వేసే విజిల్స్, చప్పట్లే నన్ను నడిపించే శక్తి. రికార్డులు వస్తుంటాయి.. పోతుంటాయి.. కానీ, మీరు నాపై కురిపించే ప్రేమ మాత్రం శాశ్వతం' అని అన్నారు. నయనతార హీరోయిన్‌గా కనిపించిన ఈ చిత్రంలో




వెంకటేశ్ కీలక పాత్రలో కనిపించి నవ్వులు పూయించారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.